RNI NO: TELTEL2023/46567

# అక్షర వేదం

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల పక్షం

AKSHARA VEDAM TELUGU DAILY

Published at Karimnagar circulated in : Telangana

సంచిక : 352 సంపుటి : 02 బుధవారం 12-11-2025 పేజీలు -8 వెల: రూ. 05.00

**విలేకరులు కావలెను**

తెలంగాణ ప్రాంతం అన్ని జిల్లాల నుండి స్టాఫ్ రిపోర్టర్లు, జిల్లా ఇన్చార్జులు, మండల రిపోర్టర్లు అర్జెంటుగా కావలెను అనుభవం ఉన్నా లేకున్నా తీసుకోబడును

ఎడిటర్ -పందిళ్ల రవీందర్ (9030653934)

తెలంగాణ స్టేట్ బ్యూరో పొన్నం ప్రసాద్ గౌడ్

9666992524



## జూబ్లీహిల్స్ పోలింగ్ ప్రశాంతం

- క్యూ లైన్‌లో ఉన్న వారికి ఓటేసే అవకాశం
- సాయంత్రం వరకు 47.16 శాతం పోలింగ్ నమోదు
- షేక్‌పేట డివిజన్‌లో పోలీసుల లాఠీఛార్జి
- పలువురు ఎమ్మెల్యేలపై కేసు నమోదు

**హైదరాబాద్, -11నవంబర్ అక్షర వేదం**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. ఓటర్లు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతో పోలింగ్ శాతం తక్కువగా నమోదయ్యింది. గత పక్షం రోజులుగా హోరాహోరీ ప్రచారం చేసి, ఓట్లను అర్థించిన ఓటర్లు పెద్దగా స్పందించ లేదు. ఉదయం నుంచి మందకొడిగా సాగిన పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 6 గంటలకు ముగిసింది. పోలింగ్ సమయం ముగిసే నాటికి క్యూలైన్లలో నిల్చున్న వారందరికీ ఓటేసేందుకు అధికారులు అవకాశం కల్పించారు. యూసుఫ్‌గూడ మహబూబ్ ఫంక్షన్ హాల్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దొంగ ఓట్ల విషయంలో నిలదీసిన బీఆర్ఎస్ నేతలపై కాంగ్రెస్ నేతలు దాడులకు పాల్పడ్డారు. దీంతో పోలీసులు -మిగతా 2 లో

## అందె శ్రీకి కన్నీటి వీడ్కోలు

**అశ్రునయనాల మధ్య అందెశ్రీ అంత్యక్రియలు**

**పాడెమోసి ప్రేమ చాటుకున్న సీఎం రేవంత్**

- హాజరైన పలువురు నేతలు..మంత్రులు..కళకారులు
- పోలీసుల గౌరవ వందనం మధ్యఅంత్యక్రియలు పూర్తి
- అందెశ్రీ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తాం
- ఆయన పేరు శాశ్వతంగా నిలిచేలా ప్రయత్నిస్తా
- పద్మశ్రీ కోసం గతంలోనే కేంద్రానికి లేఖ రాసా
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, -11నవంబర్ అక్షర వేదం**

అశ్రు నయనాల మధ్య ప్రకృతి కవి, రచయిత అందెశ్రీ అంత్యక్రియలు ముగిశాయి. ప్రభుత్వ అధికారిక లాంఛనాల నడుమ ఘట్‌కేసర్‌లోని ఎన్ఎఫ్‌సీ నగర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. పోలీసులు మూడుసార్లు గాలిలోకి కాల్పులు జరిపిన తర్వాత అంతిమ సంస్కారాలు నిర్వహించారు. మంగళవారం ఉదయం అందెశ్రీ అంతిమయాత్ర ప్రారంభమైంది. అంతకుముందు లాలాపేటలోని అందెశ్రీ నివాసం నుంచి తార్నాక, ఉప్పల్ మీదుగా ఘట్‌కేసర్ వరకు అంతిమయాత్ర నిర్వహించారు. -మిగతా 2 లో







### బాంబు దాడి నిందితులను
## వదలబోం

- భూటాన్ పర్యటనలో ప్రధాని మోడీ హెచ్చరిక
- ఈరోజు, ఇక్కడికి నేను చాలా బరువైన హృదయంతో వెల్లడి

**న్యూఢిల్లీ,**

దిల్లీలోని ఎర్రకోట వద్ద బాంబు దాడికి పాల్పడిన నిందితులను ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని ప్రధాని నరేంద్ర మోదీ హెచ్చరించారు. దేశంలోని పలు దర్యాప్తు సంస్థలు ఈ ఘటనపై దర్యాప్తును ముమ్మరం చేశాయని.. దాడికి గల కారణాలను దర్యాప్తు సంస్థల అధికారులు త్వరలో వెల్లడించనున్నారని తెలిపారు. అమాయకుల ప్రాణాలు తీసిన వారిని ఎట్టిపరిస్థితుల్లో నూ వదలబోమని దేశ ప్రజలకు హామీ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. పేలుడులో ప్రాణాలు కోల్పోయిన మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ భూటాన్ పర్యటనలో ఉన్నారు. ఆ దేశ రాజధాని థింపులో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. బాంబు పేలుడు వెనక ఉన్న కుట్రదారులను వదలబోమని.. బాధ్యులందరినీ చట్టం ముందు నిలబెడతామన్నారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్న ఏజెన్సీలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలిపారు. ఢిల్లీ పేలుడు మనసు కలిచి వేసిందన్నారు. భూటాన్ పర్యటనలో ఉన్న మోడీ.. ఢిల్లీ పేలుడుపై స్పందిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. చాలా బాధాకరమైన హృదయంతో భూటాన్ వచ్చాను. బాధితుల దు:ఖాన్ని అర్థం చేసుకున్నాం. బాధితులకు -మిగతా 2 లో

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌దే హవా

**అన్ని ఎగ్జిట్ పోల్స్‌లోను కాంగ్రెస్‌కే మొగ్గు**

**హైదరాబాద్, -11నవంబర్ అక్షర వేదం**

తెలుగు రాష్ట్రాల్లో సర్వత్రా ఆసక్తి నెలకొన్న జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నిక పోలింగ్ ముగిసింది. ఈనెల 14న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఈ నేపథ్యంలో జూబ్లీహిల్స్‌లో గెలుపెవరిదనేదానిపై ఎగ్జిట్ పోల్స్ అంచనాలు ఇలా ఉన్నాయి. వివిధ సర్వేల ఆధారంగా అక్కడ కాంగ్రెస్ గెలుపు ఖాయమని తేలిపోయింది. అన్ని సర్వేల్లోనూ కాంగ్రెస్ ముందంజలో -మిగతా 3 లో



## సూపర్ సిక్స్.. సూపర్ హిట్ చేశాం

- ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ముందడుగే
- సేఫ్ డ్రైవింగ్ చేస్తాను కనుకే ప్రజలు నమ్మారు
- మైనార్టీ సంక్షేమ దినోత్సవంలో చంద్రబాబు

**విజయవాడ,-11నవంబర్ అక్షర వేదం**

సూపర్ సిక్స్.. సూపర్ హిట్ చేసి చూపించామని సీఎం చంద్రబాబు చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు ఉండటం వల్ల కొన్ని పనులు కొంత ఆలస్యం అవుతున్నాయని వివరించారు. ఇంత అనుభవం ఉన్నా తనకే ఈ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతుబట్టడం లేదన్నారు. అయితే తనకు భయం లేదని.. అయిన ముందుకు సాగుతానని సీఎం చంద్రబాబు విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. తానుంటే క్షేమంగా ఉంటామనే నమ్మకంతో తనకు ప్రజలు ఓట్లు వేశారని ఆయన తెలిపారు. మంగళవారం స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మదినం సందర్భంగా మైనార్టీ సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు -మిగతా 2 లో



## బీహార్‌లో ఎన్‌డిఎకే పట్టం

- మరోమారు నితీశ్‌కు బీహారీల ఓటు
- అన్ని ఎగ్జిట్ సర్వేల ఫలితాలు ఎన్‌డిఎకు అనుకూలం

**పాట్నా**

దేశంలో అతి పెద్ద రాష్ట్రాల్లో ఒకటైన బీహార్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసింది. దీంతో ఈ ఎన్నికల్లో రాష్ట్ర ఓటరు ఏ పార్టీకి పట్టం కడతాడంటూ దేశవ్యాప్తంగా ప్రజల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అయితే ఈ ఎన్నికల్లో విజయవకాశాలు ఎన్డీయే కూటమికి ఉన్నాయంటూ పలు సర్వేలు స్పష్టం చేశాయి. మరి ఈ సర్వేల ఫలితాలు నిజమవుతాయా అనేది తెలియాలంటే.. నవంబర్ 14వ తేదీ వరకు ఆగాల్సి ఉంది. బీహార్ అసెంబ్లీలో మొత్తం 243 స్థానాలకు రెండు విడతలుగా పోలింగ్ జరిగింది. ఈ ఎన్నికల్లో 67 శాతానికిపైగా ఓటింగ్ నమోదు అయినట్లు ఇప్పటికే అధికారులు ప్రకటించారు. ఈ ఎన్నికల వేళ.. ఓటర్లు భారీగా పోలింగ్ కేంద్రాలకు క్యూ కట్టారు. దీంతో ఎన్డీయే కూటమి, మహాఘట్‌బంధన్ ల మధ్య తీవ్ర పోటీ నెలకొంది. మరోవైపు బీహార్‌లో ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలు సుడిగాలి పర్యటనలు నిర్వహించారు. అలాగే లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సైతం ఆ రాష్ట్రంలో ఇటీవల యాత్ర చేపట్టారు. బిహార్‌లో హోరాహోరీగా సాగిన అసెంబ్లీ ఎన్నికల పోరు ముగియడతో ఎగ్జిట్ పోల్ అంచనాలు వెల్లడించారు. రాష్ట్ర చరిత్రలో -మిగతా 2 లో

## నవీన్ యాదవ్‌కు భారీ మెజార్టీ

**తిరుగులేని ఆధిక్యంతో కాంగ్రెస్ విజయం**



- క్షేత్రస్థాయిలో పరిస్థితులు గమనించాం
- పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ధీమా

**హైదరాబాద్,-11నవంబర్ అక్షర వేదం**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో...కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు భారీ మెజారిటీ వస్తుందని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. కాంగ్రెస్ తిరుగులేని ఆధిక్యంతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పోలింగ్ జరిగిన తీరు, క్షేత్ర స్థాయిలో తమ పార్టీ కార్యకర్తలు, నాయకులు చెబుతున్న సమాచారం మేరకు కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు భారీ మెజారిటీ వస్తుందని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ సరళిపై ఆయన -మిగతా 2 లో


## ఆత్మాహుతి!

### ఢిల్లీ సూసైడ్ బాంబర్ ఫోటో రిలీజ్

**ఆత్మాహుతి బాంబర్‌గా ఉమర్ గుర్తింపు**

- ఫోటోలు విడుదల చేసిన పోలీసులు
- భారీ మందుగుండుతో కారును డ్రైవ్ చేసిన ఉమర్
- మూడు గంటలపాటు అక్కడే పార్కింగ్
- ఆ తర్వాత ఎర్రకోట - చాందిని చౌక్ రాక
- అక్కడ సిగ్నల్ వద్దకు రాగానే బాంబు యాక్టివేట్
- ఘటనలో 12 మంది మృతి.. 20 మందికి పైగా గాయాలు
- పుల్వామాలో అదుపులోకి ఉమర్ కుటుంబ సభ్యులు
- పలువురు డాక్టర్లను భద్రతాదికారులు అరెస్టు..

2 లో



## పాకిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి

- కోర్టు ఆవరణలో భారీ పేలుడు..
- 12 మంది మృతి

**న్యూఢిల్లీ,**



దాయాది పాకిస్థాన్‌లో భారీ పేలుడు సంభవించింది. ఇస్లామాబాద్‌లోని కోర్టు ఆవరణలో బ్లాస్ట్ జరిగింది. ఈ ఘటనలో 10 మందికిపైగా మరణించారు. సుమారు 20 మంది గాయపడ్డారు.పాక్ మీడియా రిపోర్ట్స్ ప్రకారం.. మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఇస్లామాబాద్ జ్యుడీషియల్ కాంప్లెక్స్ సమీపంలోని పార్కింగ్ స్థలంలో ఓ కారులో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 12 మంది మరణించగా.. 20 మందికిపైగా న్యాయవాదులు గాయపడ్డారు. వాహనంలో అమర్చిన గ్యాస్ సిలిండర్ వల్ల ఈ పేలుడు సంభవించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ ఘటనను పోలీసులు ఆత్మాహుతి దాడి గా అనుమానిస్తున్నారు. రద్దీ సమయంలో ఈ ఘటన జరగడంతో భారీగా ప్రాణ నష్టం వాటిల్లింది. అనేక వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనతో న్యాయవాదులు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. పేలుడు చాలా తీవ్రంగా ఉండటంతో ఆ శబ్దం దాదాపు ఆరు కిలోమీటర్ల పరిధి వరకూ -మిగతా 2 లో

## జూబ్లీహిల్స్‌లో 20 వేల బోగస్ ఓట్లు..

- ఎన్నికల కమిషన్‌తో రేవంత్ రెడ్డి కుమ్మక్కు
- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



**హైదరాబాద్,-11నవంబర్ అక్షర వేదం**

జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో 20 వేల బోగస్ ఓట్లు ఉన్నాయని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు స్పందించలేదు అని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్‌తో రేవంత్ రెడ్డి కుమ్మక్కై ఈ ఉప ఎన్నికలో అరాచకం సృష్టించారని ఆర్ఎస్పీ మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో డాక్టర్ దాసోజు శ్రవణ్‌తో కలిసి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు -మిగతా 2 లో

# అందేశ్రీకి కన్నీటి వీడ్కోలు

మొదటి తరువాయి

అంతమయాత్రలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్, మాజీ ఎంపీలు వీ.హనుమంతరావు, సర్వే సత్యనారాయణ, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య విమలక్క పాల్గొన్నారు. అందెశ్రీ భౌతికకాయానికి నివాళులు అర్పించారు. అందెశ్రీ పార్థీవ దేహానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులర్పించారు. మంగళవారం ఉదయం ఘట్కేసర్ చేరుకున్న సీఎం.. అందెశ్రీ అంత్యక్రియలకు హాజరయ్యారు. అందెశ్రీ కుటుంబ సభ్యులను సీఎం రేవంత్ రెడ్డి ఓదార్చారు. లాలాపేట్ జయశంకర్ స్టేడియం నుంచి తార్నాక, ఉప్పల్ మీదుగా ఘట్కేసర్ వరకు అంతిమయాత్ర సాగింది. అధికారిక లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు తెలంగాణ ప్రభుత్వం నిర్వహించింది. అందె శ్రీ అంత్యక్రియల్లో మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్, పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, వి. హనుమంతరావు పాల్గొన్నారు. రచయిత అందెశ్రీ మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన అంత్యక్రియల సందర్భంగా సీఎం అందెశ్రీ పాడెమోసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. రాజకీయ నేతలను నేరుగా కలవనని చెప్పిన అందెశ్రీ, ఆ తరువాత మీడియా మధ్యమం ద్వారా కలిశాం.. ఆయన మరణం నాకు వ్యక్తిగతంగా ఆప్తుడిని కోల్పోయిన బాధను కలిగించింది అన్నారు. అందెశ్రీకి సముచిత న్యాయం కల్పిస్తాం.. ఆయన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. జీవితాంతం తెలంగాణ కోసం జీవించిన వ్యక్తి.. కళాకారుడిగా, రచయితగా ఆర్థికంగా ఎంత ఇబ్బంది పడ్డారో అందరికి తెలుసు అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఉన్నంత వరకు అందెశ్రీ కీర్తీ శాశ్వతం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఆయన రచించిన రచనలు 20 వేల నిప్పుల వాగు పుస్తకాలను రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో అందుబాటులో పెడతాం అన్నారు. అందెశ్రీ అభిమానుల నుంచి సూచనలు తీసుకుంటాం.. ఏనాడు ఆర్థిక ఇబ్బంది గురించి ఆరోగ్యం గురించి ఆలోచించని వ్యక్తి అందెశ్రీ.. అతడ్ని కోల్పోవడం బాధాకరంగా ఉంది.. అందెశ్రీకి పద్మశ్రీ ఇవ్వాలని కేంద్రానికి లేఖ రాశా, ఈ విషయంపై ప్రధాని మోడీని కలిసి విజ్ఞప్తి చేస్తాను.. అందుకు కేంద్రమంత్రులు సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ కోరారు. అందెశ్రీ కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని ప్రకటించారు. అలాగే ఆయన రచించిన జయజయహే తెలంగాణ పాటను పాఠ్యాంశంగా తీసుకొస్తామని తెలిపారు. అందెశ్రీ రచనలను పుస్తక రూపంలో తీసుకొస్తామని చెప్పారు. అందెశ్రీ నిప్పుల వాగు పుస్తకం ఒక గైడ్ అన్నారు. అందెశ్రీ రచనలు అన్ని లైబ్రరీల్లో ఉండేలా చర్యలు తీసుకుంటామని.. ఆయన పేరు, స్ఫూర్తి శాశత్వంగా ఉండేలా చూస్తామన్నారు. అందెశ్రీ పాట, మాట గొప్ప స్ఫూర్తిని ఇచ్చిందని.. ఎన్నో సందర్భాల్లో ఇద్దరం కలిసి అనేక కీలక అంశాలపై చర్చించామని గుర్తు చేసుకున్నారు.

# జూబ్లీహిల్స్ పోలింగ్ ప్రశాంతం

మొదటి తరువాయి

రంగ ప్రవేశం చేసి.. ఇరు పార్టీల నేతలకు సర్దిచెప్పారు. కాంగ్రెస్ పార్టీ దౌర్జన్యాల నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అయితే సాయంత్రం 5 గంటల సమయం వరకు 47.16 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తంగా పోలింగ్ దాదాపు 50 శాతం వరకు చేరుకునే అవకాశం ఉంది. ఈ నెల 14వ తేదీన ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ మందకొడిగా సాగినప్పటికీ నియోజకవర్గంలోని కొన్ని డివిజన్లలో మాత్రం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ముఖ్యంగా షేక్‌పేట డివిజన్ లోని పోలింగ్ కేంద్రాల వద్ద ఘర్షణ వాతావరణం నెలకొనడంతో, పోలీసులు రంగంలోకి దిగి లాఠీ ఛార్జ్ చేయాల్సి వచ్చింది. అక్కడ పోలింగ్ బూత్‌లు 4, 5, 6, 7, 8 వద్ద బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున గుమిగూడారు. వాళ్లు హడావిడి చేయడంతో పోలీసులు వెళ్ళిపోవాలని వార్నింగ్ ఇచ్చారు.. కానీ, గులాబీ కార్యకర్తలు వెనక్కి తగ్గకపోవడంతో పోలీసులు లాఠీలకు పని చెప్పారు. పలువురు కార్యకర్తలను బూత్ ఏరియాస్ నుంచి చెదరగొట్టడానికి లాఠీ ఛార్జ్ చేయాల్సి వచ్చింది. ఈ ఉద్రిక్తత వెనుక నాన్-లోకల్స్ ఇష్యూ ఉంది.. ఎన్నికల నిబంధనల ప్రకారం? నాన్-లోకల్స్ నియోజకవర్గంలో తిరగకూడదు. అయినప్పటికీ, బీఆర్ఎస్ మాజీ మంత్రులు, నాయకులు బూత్‌ల వద్దకు వచ్చి హడావిడి చేస్తూ? ఓటర్లను ఇన్‌ఫ్లూయెన్స్ చేసే ప్రయత్నం చేస్తున్నారు అని కాంగ్రెస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. దీనిపై ఇరు వర్గాల మధ్య పెద్ద గొడవ జరగడంతో పోలీసులు ఇరు వర్గాలను చెల్లాచెదురు చేయాల్సి వచ్చింది. ఒకవైపు ఓటింగ్ పర్సంటేజ్ మందకొడిగా సాగుతుంటే? మరోవైపు బస్తీలలో ఓటర్లను డబ్బులతో ఇన్‌ఫ్లూయెన్స్ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, డబ్బులు అందకపోవడం వల్ల కూడా ఓటర్లు ఓటింగ్‌కు రావట్లేదని ఓపెన్‌గా మాట్లాడుకున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి నేపథ్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో బీఆర్ఎస్ తరపున మాగంటి సునీత, కాంగ్రెస్ తరపున నవీన్ యాదవ్, బీజేపీ నుంచి లంకల దీపక్ రెడ్డి బరిలో ఉన్నారు.

ఇదిలావుంటే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియామవళిని ఉల్లంఘించిన పలువురిపై హైదరాబాద్ పోలీసులు 3 కేసులు నమోదు చేశారు. ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, రామచంద్రనాయక్, రాందాస్‌పై మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, మెతుకు ఆనంద్‌పై బోరబండ పోలీస్ స్టేషన్‌లో ఒక కేసు నమోదైనట్టు పోలీసులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.


## నవీన్ యాదవ్‌కు భారీ మెజార్టీ

మొదటి తరువాయి

స్పందించారు. చాలా ప్రశాంతంగా ఉప ఎన్నిక జరిగిందన్నారు. ప్రజలు పెద్ద ఎత్తున తమ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతు ఇచ్చినట్లు క్షేత్రస్థాయి పరిస్థితులు స్పష్టం చేస్తున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి, అభ్యర్థికి మద్దతు ఇచ్చినట్లుగా అక్కడ ఉన్న తమ నాయకుల ద్వారా తెలుస్తోందని పేర్కొన్నారు. ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ మహేశ్ కుమార్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... రెగ్యులర్‌గా పర్యవేక్షిస్తూ అందరికీ సలహాలు, సూచనలు ఇస్తూ ముందుకు నడిపించారని కొనియాడారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, మహిళ కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ విభాగాలతోపాటు సీనియర్ నాయకులు అందరూ ప్రభుత్వ పథకాలను జనంలోకి తీసుకెళ్లడంలో విజయవంతం అయ్యారన్నారు. తాము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉండటంతో.. తమ అభ్యర్థికి పెద్ద ఎత్తున మద్దతు ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. భారీ మెజారిటీతో తమ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.

## పాకిస్థాన్‌లో ఆత్మాహుతి దాడి


మొదటి తరువాయి



వినిపించినట్లు స్థానిక మీడియా నివేదించింది. గాయపడిన వారిలో ఎక్కువ మంది లాయర్లు, కోర్టు సిబ్బందిగా పేర్కొంది. కాగా, దక్షిణ వజీరిస్థాన్ లోని కాడెట్ కాలేజ్ వానా వద్ద తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ ( దాడిని పాక్ భద్రతా దళాలు భగ్నం చేసిన విషయం తెలిసిందే. కళాశాల విద్యార్థులను బందీలుగా చేసుకోవాలన్న టీటీపీ ప్రయత్నాన్ని పాక్ బలగాలు అడ్డుకున్నాయి. టీటీపీ ప్రయత్నాన్ని అడ్డుకున్న కొన్ని గంటల్లోనే ఇస్లామాబాద్ కోర్టు ఆవరణలో బ్లాస్ట్ జరగడం గమనార్హం. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆత్మాహుతి!

- ఢిల్లీ సూసైడ్ బాంబర్ ఫోటో రిలీజ్
- సూత్రధారి డాక్టర్ ఉమర్ మహ్మద్
- ఫోటోలు విడుదల చేసిన పోలీసులు
- భారీ మందుగుండుతో కారును డ్రైవ్ చేసిన ఉమర్
- మూడు గంటలపాటు అక్కడే పార్కింగ్
- ఆ తర్వాత ఎర్రకోట - చాందిని చౌక్ రాక
- అక్కడ సిగ్నల్ వద్దకు రాగానే బాంబు యాక్టివేట్
- ఘటనలో 12 మంది మృతి.. 20 మందికి పైగా గాయాలు
- పుల్వామాలో అదుపులోకి కుమార్ కుటుంబ సభ్యులు
- పలువురు డాక్టర్లను భద్రతాదికారులు అరెస్టు..



**న్యూఢిల్లీ**

దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసిన, దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన పేలుడు ఘటనపై అధికారులు దర్యాప్తును ముమ్మరం చేశారు. సీసీటీవీ దృశ్యాల ఆధారంగా ఫరీదాబాద్ ఉగ్ర కుట్రతో సంబంధాలు ఉన్న డా.ఉమర్ మహ్మద్ ఈ పేలుడులో కీలక వ్యక్తి అని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. పుల్వామాకు చెందిన ఉమర్ 1989 ఫిబ్రవరిలో జన్మించాడు. అతడి తండ్రి జీహెచ్ నబీ భట్, తల్లి షమీమా బానో. ఉమర్ తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేసి.. దాదాపు 10 ఏళ్ల క్రితం ఉద్యోగం నుంచి వైదొలిగారు. శ్రీనగర్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ఉమర్ ఎంబీబీఎస్, ఎండీ పూర్తి చేశాడు. కొన్నాళ్లు.. జీఎంసీ అనంతనాగ్‌లో సీనియర్ రెసిడెంట్‌గా ఉన్నాడు. అనంతరం ఫరీదాబాద్ లోని అల్ ఫలాహ్ వైద్య కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేశాడు. సోషల్ మీడియా వేదికగా తీవ్రవాద భావజాలానికి గురైన డాక్టర్లలో ఉమర్ కూడా ఒకడు. ఇటీవల జమ్మూకశ్మీర్‌లో నిర్వహించిన ఉగ్రవాద ఆపరేషన్‌లో పలువురు డాక్టర్లను భద్రతాధికారులు అరెస్టు చేశారు. వారితో ఉమర్‌కు కూడా సంబంధాలు ఉన్నాయని అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. అరెస్టయిన డా.అదిల్‌కు ఉమర్ సన్నిహితుడు అని, గతంలో వీరిద్దరూ అనంత్‌నాగ్‌లో కలిసి పనిచేసినట్లు కనుగొన్నారు. వారి అరెస్టు నేపథ్యంలో భయాందోళనకు గురైన ఉమర్..ఈ పేలుడుకు పాల్పడినట్లు నిఘా వర్గాలు అనుమాని స్తున్నాయి. ఇక, తాజా పేలుడు నేపథ్యంలో ఉమర్ కుటుంబసభ్యులను పోలీసు అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అతడి సోదరులు జహూర్, ఆషిక్ నబీలను కూడా అరెస్టు చేసి విచారిస్తున్నట్లు సమాచారం. శుక్రవారం ఉమర్ తన తల్లికి ఫోన్ చేసి.. లైబ్రరీలో చదువుకోవడంలో బిజీగా ఉన్నందున తనకు ఫోన్ చేయొద్దని పేర్కొన్నట్లు తెలిసింది. ఈ క్రమంలో తన ఫోన్‌ను కూడా స్విచ్ ఆఫ్ చేశాడు. పేలుడుకు కారణమైన కారులో ఓ వ్యక్తి శరీర భాగాలను అధికారులు గుర్తించారు. ఇవి ఉమర్‌వా, కావా అని తెలుసు కునేందుకు అతడి కుటుంసభ్యుల నుంచి డీఎన్ఏ నమూనాలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఢిల్లీ పేలుడులో ఉమర్‌తో పాటు మరో ముగ్గురు వ్యక్తుల ప్రమేయం ఉన్నట్లు నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి. వారు తారిఖ్ అహ్మద్ మాలిక్, ఆమిర్ రషీద్, ఉమర్ రషీద్‌గా గుర్తించారు. ఈ క్రమంలో ఢిల్లీ పేలుళ్ల కేసులో ఆత్మాహుతి బాంబర్‌గా అనుమానిస్తున్న డా.ఉమర్ మహమ్మద్ ముఖచిత్రం బయటపడింది. సోమవారం సాయంత్రం ఎర్రకోట సమీపంలో పేలిన వైట్ హ్యుండాయ్ ఐ20కారు ఉమర్‌కు చెందినదిగా పోలీసులు తేల్చారు. ఈ దుర్ఘటనలో 12 మంది మరణించగా, 20 మంది క్షతగాత్రులయ్యారు. దీనిని ఆత్మాహుతి బాంబర్‌గా అనుమానిస్తున్న పోలీసులు.. అతడి ముఖాన్ని యాక్సెస్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి జమ్ము కశ్మీర్ అతడి తల్లి, సోదరులను దర్యాప్తు బృందం అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టింది. జమ్ము కశ్మీర్, హరియాణా పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో 'వైట్ కాలర్' టెర్రర్ మాడ్యూల్‌లో సోమవారం అరెస్టైన ఇద్దరు వైద్యులు అదిల్ అహ్మద్ రాథర్, ముజామ్మిల్ షకీల్‌లతో ఇతడికి సాన్నిహిత్యం ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. కొన్ని రోజులుగా మాడ్యూల్‌లో ఉన్న ఆ ఇద్దరు కీలక సభ్యులను అరెస్ట్ చేసిన దర్యాప్తు బృందం.. వారి నుంచి సుమారు 2,900 కిలోల అనుమానిత పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకుంది. విషయం తెలుసుకున్న ఉమర్.. ఫరీదాబాద్ నుంచి పరారయ్యాడు. అతడు భయాలోందనకు గురై ఇలా ఆత్మాహుతి బాంబుదాడికి పాల్పడినట్టు సమాచారం. ఈ దాడి చేసేందుకు ఉమర్, అతడి సన్నిహితులు అమ్మోనియం నైట్రేట్ ఇంధన ఆయిన్‌ను వినియోగించారు. కారులో డిటోనేటర్‌ను ఉంచి లాల్‌ఖిలా సమీపంలో రద్దీగా ఉండే ప్రదేశంలో ఈ ఉగ్రదాడికి పాల్పడ్డారు. ఎర్రకోట సమీపంలో పేలిన హ్యుండాయ్ ఐ20 వాహనం.. బాదర్‌పూర్ సరిహద్దు నుంజి ఢిల్లీలోకి ప్రవేశించిన దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీలలో నిక్షిప్తమయ్యాయి. ఆ కారును.. ఔటర్‌రింగ్ రోడ్ నుంచి మధ్యాహ్నం గం.3:19ల ప్రాంతంలో ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో పార్క్ చేశారు. ఆ తర్వాత మూడు గంటల అనంతరం సాయంత్రం గం.6:30లకు అక్కడి నుంచి బయల్దేరిందని అధికార వర్గాలు తెలిపాయి. అనుమానిత ఆత్మాహుతి దళ సభ్యుడు ఒక్క నిమిషం కూడా ఆ కారును వదిలివెళ్లలేదని పేర్కొన్నాయి. దాడిలో ఉపయోగించిన కారు అనేకసార్లు చేతులు మారిందని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. తొలుత ఆ కారును గురుగ్రామ్‌కు చెందిన సల్మాన్ అనే వ్యక్తి 2025 మార్చిలో ఓఖ్లాలోని దేవేందర్‌కు అమ్మాడు. ఆ తర్వాత దేవేందర్ దానిని అంబాలా వాసికి విక్రయించాడు. ఆ వ్యక్తి నుంచి అమీర్‌కు, ఆపై తారిఖ్, ఉమర్‌లకు చేతులు మారి పుల్వామాకు చేరింది. అక్కడ అమీర్, తారిఖ్, రశీద్‌ల మధ్య సంబంధాలు బయటపడ్డాయి. ఈ క్రమంలో అమీర్, తారిఖ్‌లను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు ఢిల్లీ పోలీసులు.

## బాంబు దాడి నిందితులను వదలబోం

మొదటి తరువాయి

న్యాయం జరిగేలా చూస్తాం. ఢిల్లీ బాంబ్ పేలుడు సూత్రధారులను విడిచిపెట్టబోం. కుట్రదారులను చట్టం ముందు నిలబెడతాం. ఇప్పటికే ఉగ్ర కుట్ర మూలాలను గుర్తించాం. ఢిల్లీ ఘటనపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూనే ఉన్నాం. పేలుడుపై అర్ధరాత్రి వరకు సమీక్షలు చేస్తూనే ఉన్నాం. బాధితుల వెంట దేశమంతా ఉందని మోడీ తెలిపారు. రెండు రోజుల పర్యటన కోసం ప్రధాని మోడీ మంగళవారం ఉదయం భూటాన్ వెళ్లారు. పర్యటన ముగించుకుని బుధవారం ఢిల్లీకి చేరుకోనున్నారు. అనంతరం రేపు సాయంత్రం 5:30 గంటలకు కేబినెట్ సమావేశం కానుంది. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

## జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌దే హవా

మొదటి తరువాయి

ఉండగా బిఆర్ఎస్ రెండోస్థానంలో ఉంది. ఇక బిజెపి అతి తక్కువ ఓట్ల శాతంతో మూడో స్థానంలో ఉంది. చాణక్య స్ట్రాటజీస్ కాంగ్రెస్‌కు 46శాతం, భారత రాష్ట్ర సమితికి 43 శాతం, బిజెపి 6 శాతం ఓట్లు వస్తాయని అంచనా వేసింది. హెచ్ఎంఆర్ సర్వే.. కాంగ్రెస్‌కు 48.3శాతం, భారత రాష్ట్ర సమితికి 43.18శాతం, భాజపాకు 5.84 శాతం ఓట్లు లభించే అవకాశముందని పేర్కొంది. స్మార్ట్ పోల్ సర్వే .. కాంగ్రెస్‌కు 48.2శాతం, భారత రాష్ట్ర సమితికి 42.1 శాతం, భాజపాకు 7.6 శాతం, ఇతరులకు 2.1శాతం ఓట్లు పోలయ్యే అవకాశముందని తెలిపింది. మొత్తంగా అన్ని సర్వేల్లోనూ కాంగ్రెస్ ఋూదక్యం కనిపించింది. దీంతో కాంగ్రెస్ గెలుపు ఖాయమని ఆ పార్టీ నేతలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో ఉప ఎన్నిక నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. 58 మంది అభ్యర్థులు బరిలో ఉన్నా.. ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ ఉంది. భారత రాష్ట్ర సమితి తరపున మాగంటి గోపీనాథ్ భార్య సునీత, కాంగ్రెస్ పక్షాన నవీన్ యాదవ్, భాజపా తరపున లంకల దీపక్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. గెలుపుపై ఎవరికి వారు ధీమాగా ఉన్నారు. ఎన్నికను అధికార పార్టీ, ప్రతిపక్షాలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. నియోజకవర్గంలోని రాజకీయ పరిణామాలు, ఓటర్లు ఇచ్చే తీర్పుపై రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఆసక్తి నెలకొంది.

## సూపర్ సిక్స్..సూపర్ హిట్ చేశాం

మొదటి తరువాయి

నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. పెన్షన్‌లు రూ. 4 వేలు, రూ. 6 వేలు, రూ. 15 వేలు ఇచ్చే ఏకైక ప్రభుత్వం మనదేనని ఆయన స్పష్టం చేశారు. తల్లికి వందనం కింద ఎంత మంది పిల్లలు ఉంటే అంత మందికీ నగదు ఇస్తున్నామన్నారు. కేర్ ఫుల్‌గా డ్రైవ్ చేసే వ్యక్తిని కాబట్టి.. సురక్షితంగా ఒడ్డుకు తీసుకెళ్తానని భరోసా ఇస్తున్నానని పేర్కొన్నారు. తాను సైతం రాత్రింబవళ్లు పని చేస్తున్నానన్నారు. సంక్షేమం, అభివృద్ధిని సమానంగా తీసుకు వెళ్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు ఏపీకి రూ. 10 లక్షల పెట్టుబడులు వచ్చాయని వివరించారు. విశాఖపట్నం వేదికగా జరగనున్న భాగస్వామ్య సదస్సు ద్వారా మరో రూ. 10 లక్షల పెట్టుబడులు రానున్నాయని తెలిపారు. గూగుల్ ద్వారా రూ. లక్షా 25 వేల కోట్లు రానున్నాయని.. వాటిని ఐదేళ్లలో విశాఖపట్నంలో ఖర్చు పెట్టబోతున్నామన్నారు. కేంద్రం నగదు ఇస్తే.. మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకుండా గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. వారి చేతకాని పాలనతో.. కోట్లాది రూపాయల నిధులు కేంద్రం వద్ద ఆగిపోయాయన్నారు. వాటన్నింటినీ మళ్లీ సరిచేసి అమలు చేస్తామని ఈ సందర్భంగా ప్రజలకు సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. ఏపీకి ఉన్న బ్రాండ్‌ను అంతా భ్రష్టు పట్టించారంటూ వైసీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ అందరిలో నమ్మకం కల్గించి.. పెట్టుబడి దారులను తీసుకువస్తున్నామన్నారు. ఎవరైనా అసంతృప్తితో ఉంటే.. అందుకు కారణం తెలుసుకుని సమస్యను పరిష్కరిస్తున్నానన్నారు. కష్టపడి పని చేయకండి.. ఇష్టపడి పని చేయండంటూ ఉద్యోగులకు సీఎం చంద్రబాబు సూచించారు. తాను ఉద్యోగులకు అండగా ఉంటానని.. అందరం కలిసి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం అవుదామని ఉద్యోగులకు పిలుపునిచ్చారు. భగవంతుడు తనకు అన్ని అవకాశాలు ఇచ్చాడని.. తాను ప్రజల కోసమే ఆలోచన పని చేస్తున్నానని పేర్కొన్నారు. సుదీర్ఘ కాలం తాను సీఎంగా ఉన్నానంటే.. అది ప్రజల ఆదరణ, అభిమానమే కారణమన్నారు. శాశ్వతంగా మీ వాడిగా ఉంటాను.. అన్ని విషయాల్లో తోడుగా ఉంటానని ఈ సందర్భంగా ప్రజలకు ఆయన హామీ ఇచ్చారు. భారత దేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని యువతకు ఆయన పిలుపునిచ్చారు. మైనార్టీ సంక్షేమ దినోత్సవం సందర్భంగా సయ్యద్ నషీద్ అహ్మద్‌ను లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ పురస్కారంతో సీఎం చంద్రబాబు సత్కరించారు. అలాగే ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఆయన సన్మానించారు. రాష్ట్ర మైనారిటీ సంక్షేమ దినోత్సవం, జాతీయ విద్యా దినోత్సవాన్ని నేడు మనం జరుపుకుంటున్నామన్నారు.

## బీహార్‌లో ఎన్‌డిఎకే పట్టం

మొదటి తరువాయి

ఎన్నడూ లేనంతగా రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. ఆయా సర్వేలు ఎగ్జిట్ పోల్స్ అంచనాలు వెల్లడించాయి. వీటిలో ఎక్కువగా అధికార 'ఎన్డీయే'కు బిహారీలు మరోసారి పట్టం కట్టనున్నట్లు పేర్కొన్నాయి. అధికార పక్షానికి మెజార్టీ మార్కు 122 కంటే ఎక్కువ సీట్లు వస్తాయని దాదాపు అన్ని సర్వేలు అంచనాకు వచ్చాయి. ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన్‌సురాజ్ పార్టీ అంతగా ప్రభావం చూపలేదని తెలిపాయి. బిహార్‌లో అధికార ఎన్డీయే 133-159 స్థానాల్లో విజయం సాధిస్తుందని పీపుల్స్ పల్స్ అంచనా వేసింది. మహాగఠ్‌బంధన్‌కు 75-101 సీట్లు వచ్చే అవకాశం ఉందని తెలిపింది. ప్రశాంత్ కిశోర్ నేతృత్వంలోని జన్ సురాజ్ పార్టీకి 0-5 స్థానాలు, ఇతరులు 2-8 స్థానాల్లో విజయం సాధించవచ్చని అంచనా వేసింది. దైనిక్ భాస్కర్ ఎన్డీయేకు 145-160 సీట్లు, మహాగఠ్‌బంధన్‌కు 73-91 సీట్లు రావచ్చని అంచనా వేసింది. ఎన్డీయేకు 147-167, విపక్షాలకు 70-90 స్థానాలు ఇతరులకు 2-8 స్థానాలు వస్తాయని మ్యాట్రిజ్ అంచనా వేసింది. పీపుల్స్ ఇన్‌సైట్ కూడా ఎన్డీయేకు 133-148, విపక్షాలకు 87-102 సీట్లు, ఇతరులకు 3-6 వస్తాయని పేర్కొంది. జన్‌సురాజ్ పార్టీకి మాత్రం 0-2 స్థానాల్లో గెలుపొందే అవకాశం ఉందని తెలిపాయి. మొత్తంగా బీజేపీ సారథ్యంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమికి ప్రధాన ఎగ్జిట్ పోల్ సర్వేలు పట్టం కట్టాయి. ఎన్డీయే కూటమి తిరిగి అధికారంలోకి రాబోతోందని తెలిపాయి. మెజారిటీకి 122 సీట్లు అవసరం కాగా, ఈ నాలుగు సర్వేల్లోనూ ఎన్డీయే దూసుకుపోయింది. జేవీసీ ఎగ్జిట్ పోల్ అంచనా ప్రకారం ఎన్డీయే 135 నుంచి 150 సీట్లు గెలుచుకుంటుంది. ఇండియా కూటమికి 83 నుంచి 103 సీట్లు వస్తాయి. డీవీసీ రీసెర్చ్ (ఆ÷ఎఅ సఃబఃసజీఇఠ) పోల్స్ సర్వే ప్రకారం ఎన్డీయే 137 నుంచి 152 సీట్లు గెలుచుకుంటుంది. మహాగఠ్‌బంధన్ 83 నుంచి 98 సీట్లు, జన్‌సురాజ్ 2 నుంచి 4, ఇతరులు 4 నుంచి 8 సీట్లు గెలుచుకుంటారని తెలిపింది. చాణక్య సర్వే ప్రకారం ఎన్డీయే 130 నుంచి 138 సీట్లు గెలుచు కుంటుంది. ఎంజీబీ 100 నుంచి 108, ఇతరులకు 3 నుంచి 5 సీట్లు వస్తాయి. టైమ్స్ నౌ సర్వే ప్రకారం ఎన్డీయే 129 సీట్లు గెలుచుకుంటుంది. ఎంజీబీ 86 సీట్లు, జేఎస్‌పీ 2 సీట్లు, ఇతరులు 3 సీట్లు దక్కిచుకుంటారు.

## జూబ్లీహిల్స్‌లో 20 వేల బోగస్ ఓట్లు..

మొదటి తరువాయి

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయాలని గత మూడు నాలుగు నెలల నుంచి ఎన్నికల కమిషన్, ప్రభుత్వం కలిసి కుట్ర పన్నినట్లు స్పష్టంగా అర్థమవుతుంది. 40 రోజుల క్రితం బీఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులం కలిసి 20 వేల బోగస్ ఓట్లను సృష్టించుకున్నారని, ఈ ఓట్లతో గెలవాలని చూస్తున్నారని చెప్పి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశాం. ఇంత వరకు బోగస్ ఓటర్లను పట్టుకోలేకపోయారు. ఇది కుట్రకు మొదటి సంకేతం. ఇక రెండో కుట్ర.. ఎన్నికల వేళ ఏదైనా ఉల్లంఘన జరిగితే సీవిజిల్ యాప్ ద్వారా వెంటనే ఫొటో తీసి వీడియో తీసి అప్‌లోడ్ చేయాలి. ఈ సీ విజిల్ ఈ రోజు కూడా పని చేయడం లేదు. నేను, శ్రవణ్, కౌశిక్ రెడ్డి కలిసి ఎలక్షన్ అధికారులను కలిసి ఫిర్యాదు చేశాం. సీ విజిల్ యాప్ పని చేయడం లేదని చెప్పాం. కేంద్ర ఎన్నికల సంఘం ఆధీనంలో ఉంటుందని చెప్పారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు.

# సైబర్ సెక్యూరిటీ,సైబర్ జాగృత్ భారత్ అంశాలపై అవగాహన సదస్సు

**అక్షర వేదం:నవంబర్ 11,రామగిరి**
కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ వారి ఆదేశాల మేరకు సింగరేణి వ్యాప్తంగా సైబర్ సెక్యూరిటీ,సైబర్ జాగృత్ భారత్ అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది. రామగుండం-3,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా అధికారులకు,ఉద్యోగులకు మంగళవారం స్థానిక సి.ఎన్.సి.ఓ.ఎ.క్లబ్ నందు సింగరేణి కార్పొరేట్ హెచ్.ఆర్.డి.విభాగం వారి ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ,సైబర్ జాగృత్ భారత్ అంశాలపై అవగాహణ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సును రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర రావు,అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు హాజరై ప్రారంభించారు.దీనిలో భాగంగా కార్పోరేట్ ఐ.టి. విభాగం డి.జి.యం. ఎం.శ్రీనివాస రావు, ఐ.టి మేనేజర్ డి.ఎస్.నానపెర్నాన్ వీస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సైబర్ సెక్యూరిటీ, సైబర్ జాగృత్ భారత్ అంశాలపై చక్కని అవగాహన




కల్పించారు.ప్రస్తుతం ఉన్నటువంటి సాంకేతిక యుగంలో ప్రతి ఒక్కరూ వీటి గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు.రోజు రోజుకు అందుబాటులోకి వస్తున్న సాంకేతికతతో పాటు అదే స్థాయిలో సైబర్ నేరాలు కూడా పెరుగుతున్నాయని, ప్రతి రోజు సైబర్ నేరస్తుల చేతిలో అమాయక ప్రజలు మోసానికి గురవుతున్నారని, దీనికి కారణం వారికి సరైన అవగాహన లేకపోవడమే అన్నారు.ప్రతి ఒక్కరు కూడా కంపెనీ విలువైన విషయాలు గాని లేదా వారి నగదు సంబంధించి పర్సనల్ డేటా ను అత్యంత గోప్యంగా ఉంచాలని సూచించారు. కంపెనీలో సైబర్ సెక్యూరిటీ అమలు పరచటం ద్వారా కంపెనీ బిజినెస్ పెరుగుతుందని, విలువైన సమాచారాన్ని గోప్యంగా ఉంచవచ్చునని, తద్వారా కంపెనీకి మంచి పేరు వస్తుందని అన్నారు. మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా సింగరేణి సంస్థ కుడా సైబర్ సెక్యూరిటీ పట్ల ఎప్పటికప్పుడు ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్లు వై.వి.శేఖర బాబు, కె.యాదయ్య, ఎస్వోటుజిఎంలు యం.రామ్మోహన్, బండి సత్య నారాయణ, ఐ.టి.అధికారిని ఆర్. రాజేశ్వరి లతో పాటు వివిధ గనుల విభాగాల అధిపతులు,అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# కవి రచయిత గాయకుడు అందెశ్రీ కి ఘన నివాళి అర్పించిన ఉద్యమకారులు

**అక్షర వేదం:నవంబర్ 11,రామగిరి**
పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటినరీకాలనీ రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం ముందు గల అమరవీరుల స్తూపం వద్ద స్వర్గీయ తెలంగాణ ఉద్యమకారులు,జయ జయహే తెలంగాణ గీతాన్ని రాసి పాడిన అందెశ్రీ కి ఘన నివాళులు అర్పించిన తెలంగాణ ఉద్యమకారులు,ఉద్యమ కళాకారులు, తదితరులు మాట్లాడుతూ అందెశ్రీ మరణం తీరని లోటని అన్నారు.అందెశ్రీ సిద్దిపేట జిల్లా రేవతి గ్రామంలో జన్మించి ఎన్నో కష్ట నష్టాలకు ఓర్చి గొర్ల కాపరిగా నిత్యకూలిగా జీవనం గడుపుతూ కవిగా తన ప్రస్థానం కొనసాగించారు.ప్రజల కష్టాలనే తన రచనల రూపంలో రాస్తూ ప్రజలను ఎంతగానో చైతన్య పరిచారు.అంతే కాకుండా జయ జయహే తెలంగాణ గీతాన్ని కూడా రాసి తెలంగాణ ప్రజల గొంతుక అయ్యాడు, మాయమైపోతున్నాడమ్మా మనిషన్నవాడనే పాట ద్వారా మన దేశానికి



పరిచయమైపోయారు.ఇంతటి గొప్ప వ్యక్తిని కోల్పోవడం మన దురదృష్టకరం అని కొనియాడారు. అలాగే అందెశ్రీ విగ్రహాన్ని ట్యాంక్ బండిమీద కాంస్య విగ్రహాన్ని నిర్మించాలని అలాగే ఏదైనా ఒక యూనివర్సిటికి అతని పేరు పెట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల పోరం రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పోతు జ్యోతిరెడ్డి,రాష్ట్ర ఉపాధ్యక్షులు నూనె రాజేశం,రాష్ట్ర కార్యదర్శి కదార కళాధర్ రెడ్డి,మండల అధ్యక్షులు శ్రీనివాస చారి,అరుణోదయ రాష్ట్ర కమిటి నాయకులు చిట్యాల యాకూబ్, తెలంగాణ ఉద్యమకారులు గౌతమ్ శంకరయ్య, వేగొలపు మల్లయ్య, బుర్ర శంకర్, బియ్యన్న తిరుపతి,జింక వెంకటేష్, మునిగాల శ్రీనివాసరెడ్డి, బొంకూరు పోషం, మల్యాల మోహన్, విష్ణుభక్తుల సారయ్య, ఆరెందల ప్రకాష్ తదితరులు ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని ప్రకటిస్తు ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

# రేకుర్తి కంటి ఆసుపత్రి సేవలు అమోఘం

**- లయన్స్ క్లబ్ ప్రతినిధుల ప్రత్యేక సమావేశంలో పాల్గొన్న క్లబ్ అధ్యక్షులు మేకల మారుతి యాదవ్**

**అక్షర వేదం సెప్టెంబర్ 11 రామగిరి**
కరీంనగర్‌లోని రేకుర్తి కంటి ఆసుపత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి మరియు వైస్ చైర్మన్ చిదుర సురేష్ ఆధ్వర్యంలో 320+ జిల్లా పరిధిలోని 92 లయన్స్ క్లబ్‌ల అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులతో సమావేశం నిర్వహించబడింది.ఈ సమావేశానికి జిల్లా గవర్నర్ లయన్ కోదండ రాజు సింహరాజు, ఫస్ట్ డిస్టిక్ వైస్ ప్రెసిడెంట్ మోర బద్రేశం, సెకండ్ డిస్టిక్ వైస్ ప్రెసిడెంట్ గుటక చంద్ర ప్రకాష్ , డిస్ట్రిక్ట్ క్యాబినెట్ మెంబర్స్ సింగిరెడ్డి వాసుదేవ రెడ్డి, గాలిపెల్లి వెంకట్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.రేకుర్తి హాస్పిటల్ లో ఉచిత ఆపరేషన్ చేస్తూనే మెల్లకన్ను, రెటీనా



మొదలగు శస్త్ర చికిత్సలను పేద ప్రజల అవసరాల దృష్ట్యా తక్కువ ఖర్చుతో అన్ని రకాల కంటి ఆపరేషన్లు అందిస్తూ రేకుర్తి కంటి ఆసుపత్రి చేస్తున్న సేవలను అతిథులు అభినందించారు. ఈ సేవలను ప్రతి లయన్స్ క్లబ్ తమ ప్రాంత ప్రజలకు తెలియజేసి, కంటి సమస్యల పరిష్కారానికి సహకరించాలని వారు కోరారు.చైర్మన్ కొండ వేణుమూర్తి గారు హాస్పిటల్ మొత్తం చూపిస్తూ, కంటి ఆపరేషన్ కోసం ఆసుపత్రిలోని ఉపయోగించే ఆధునిక మిషనరీ, టెక్నాలజీ వివరాలను చూపిస్తూ అవగాహన కల్పించారు. లయన్స్ క్లబ్ సెంటనరీ కాలనీ అధ్యక్షుడు మేకల మారుతి మాట్లాడుతూ, రేకుర్తి కంటి ఆసుపత్రి ద్వారా ఇప్పటికే తమ ప్రాంతంలో 500 మందికి పైగా ప్రజలు కంటి ఆపరేషన్లు చేయించుకుని సంతృప్తి వ్యక్తం చేశారని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన చైర్మన్ కొండ వేణుమూర్తి, వైస్ చైర్మన్ చిదుర సురేష్ లకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో క్లబ్ అడ్మినిస్ట్రేటివ్ డాక్టర్ శరణ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# కరాటే పోటీలలో ఖని విద్యార్థుల సత్తా..!

**- బంగారు పతకం గెలుచుకున్న జయ సాయి చరణ్, సాయి వైష్ణవి.**

**అక్షరవేదం/గోదావరిఖని: నవంబర్11**
వరంగల్ లో గురు షాటోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే టోర్నమెంట్ లో గోదావరిఖని కి చెందిన డ్రాగన్ షాటోకాన్ కరాటే క్లబ్ విద్యార్థులు పాల్గొని పలు పతకాలు సాధించినట్టు క్లబ్ వ్యవస్థాపకుడు కరాటే మాస్టర్ పసునూటి చందు తెలిపారు. సీనియర్ బాలుర బ్రౌన్ బెల్ట్ స్పరింగ్, కాటా విభాగంలో టింగు, జయసాయి చరణ్ బంగారు పతకం



గెలుపొందారు. అలాగే జూనియర్, సబ్ - జూనియర్ కాటా స్పరింగ్ విభాగల్లో, పసునూటి రియాన్ష్, ఆయన్ష్ టింగు, సాయి వైష్ణవి, వాసికర్, గాధర్ల సహస్ర, భవాని, స్పందన, తాన్వి కృష్ణ, యం. డి రేహన్, యం. డి జైన్, స్మితేష్, సుహీరా అన్వా, అనన్య, సాయి రోషన్, అక్షయ్, అభిషేక్, సాత్విక్ నందన్, భార్గవ రామ, రోనీత్ కుమార్, నందిని రాజ్,బంగారు, వెండి, కంస్య, పతకాలు సాధించారు. టోర్నమెంట్ లో ఓవరల్ గ్రాండ్ ఛాంపియన్షిప్ కైవసం చేసుకున్నారు. విజేతలను మంగళవారం డబ్ల్యూఎఫ్ఎస్ కె ఓ తెలంగాణ చీఫ్ వి. చంద్రశేఖర్ విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాలల ఉపాధ్యాయులు అభినందించారు.

# విద్యావేత్త లతీఫ్ ఖాన్ కు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జాతీయ అవార్డు




**హైదరాబాద్, నవంబర్ 11 (అక్షర వేదం):**
ప్రతిష్టాత్మకమైన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జాతీయ అవార్డు-2025ను తెలంగాణ ప్రభుత్వం ప్రఖ్యాత విద్యావేత్త, ఎంఎస్ ఎడ్యుకేషన్ అకాడమీ వ్యవస్థాపక-చైర్మన్ మహ్మద్ లతీఫ్ ఖాన్ కు ప్రదానం చేసింది. విద్య, సామాజిక సంక్షేమం, మైనారిటీ అభ్యున్నతి రంగాలలో ఆయన మూడు దశాబ్దాలుగా చేసిన అంకితభావ సేవకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేశారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జాతీయ అవార్డును విద్య, ఉర్దూ భాష, సాహిత్యం, సామాజిక సేవ రంగాలలో అత్యుత్తమ కృషి చేసిన వ్యక్తులకు ప్రతి సంవత్సరం ప్రదానం చేస్తారు. ఈ సంవత్సరం కార్యక్రమం 2024-25 రెండింటికీ అవార్డు గ్రహీతలను గుర్తించింది. లతీఫ్ ఖాన్ రూ.2 లక్షల 25 వేల నగదు బహుమతి, ప్రశంసా పత్రం, జ్ఞాపిక అందుకున్నారు. అణగారిన వర్గాల విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందుబాటులోకి తీసుకురావడమే జీవిత లక్ష్యమని లతీఫ్ ఖాన్ అన్నారు.

# మంత్రి శ్రీధర్ బాబు చొరవ తొ సెంటినరి కాలనీ నుండీ గోదావరి ఖని వరకు 4 లైన్ రోడ్



**అక్షర వేదం:నవంబర్ 11,రామగిరి**
ఐటీ ఇండస్ట్రియల్ శాఖ మంత్రి శ్రీధర్ బాబు సింగరేణి సిఎండి తో ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరగా రోడ్డు వేయాలని చెప్పడంతో మంగళ వారం జిఎం సివిల్ వెంకటేశ్వర్లు వచ్చి సెంటనరీ కాలనీ నుండి గోదావరిఖనికి వెళ్లే దారి సర్వే చేసుకొని ఎక్స్టెన్షన్ తీసుకోవడం జరిగింది,4 లైన్ రోడ్ బడ్జెట్ కేటాయించే వరకు తాత్కాలిక రోడ్ వేయడానికి యుద్ధ ప్రాతిపదికంగా రోడ్డు పనులు ప్రారంభించారు.ఈ విషయమై సివిల్ జిఎం ను మర్యాదపూర్వకంగా కలసిన ఆర్జీ త్రి ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి,బ్రాంచ్ కార్యదర్శి బెల్లం శ్రీను కు ధన్యవాదాలు తెలియజేసి సన్మానించినారు,సెంట్రనరి కాలనీలో ఉన్న రోడ్లు పన్నూరు క్రాస్ రోడ్ నుండి ఏఎల్పి కి వెళ్లే దారి ఫేజ్ టు వరకు కూడా రోడ్డు వెంటనే వేయాలని కోరడం జరిగింది దానికి సానుకూలంగా స్పందించిన జిఎం సివిల్ త్వరగా రోడ్డు సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు.

# గుండె లయ రుగ్మతలకు కేర్ అధునాతన 'క్యూ డాట్' చికిత్స



**హైదరాబాద్, నవంబర్ 11 (అక్షర వేదం):**
దేశంలో ఆధునిక హృదయ చికిత్సలో ముందంజలో ఉన్న బంజారాహిల్స్ కేర్ హాస్పిటల్స్ మరో మైలురాయిని సాధించిందని కేర్ హాస్పిటల్స్ జోనల్ సీఓఓ బిజు నాయర్ తెలిపారు. మంగళవారం కార్డియాక్ ఎలక్ట్రోఫిజియాలజీ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ ఎస్.వి.కెతో కలసి ఆయన మాట్లాడుతూ తాజాగా ప్రారంభమైన క్యూ డాట్ టెక్నాలజీ సహాయంతో ఆట్రియల్ ఫైబ్రిలేషన్ అబ్లేషన్(గుండె వేగంగా లేదా అసమానంగా కొట్టుకోవడం సమస్యను సరిచేయడానికి చేసే చికిత్స) శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ అత్యాధునిక ఎలక్ట్రోఫిజియాలజీ పద్ధతిని ఉపయోగించిన దేశంలోని తొలి ఆసుపత్రులలో కేర్ హాస్పిటల్స్ ఒకటిగా నిలిచిందన్నారు. ఈ చికిత్సను 57 ఏళ్ల మహిళపై విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఆమెకు నిరంతర గుండె దడ(కర్ణిక దడ), బయాట్రియల్ కార్డియోమయోపతి ఉన్నట్లు వైద్యులు గుర్తించారని, ప్రస్తుతం ఆమె బంజారాహిల్స్‌లోని కేర్ హాస్పిటల్స్‌లో రీజినల్ క్లినికల్ డైరెక్టర్, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు పర్యవేక్షణలో చికిత్స పొందుతూ, శస్త్రచికిత్స తర్వాత పూర్తిగా స్థిరంగా ఉండి, గుండె లయ సాధారణ స్థాయిలో కొనసాగుతోందని తెలిపారు.

# తెలంగాణ కెరటం అందెశ్రీకి ఖనిలో ఘనంగా నివాళులు..!

**అక్షరవేదం /గోదావరిఖని:నవంబర్11**
తెలంగాణ సాహిత్యలోకానికి కెరటం, ప్రజల మనసులను కదిలించిన గాయకుడు అందెశ్రీ మరణం పట్ల సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, కాంగ్రెస్ పార్టీ బీసీ విభాగం అధ్యక్షులు గట్ల రమేష్ గారి ఆధ్వర్యంలో మంగళవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో కార్పొరేషన్ అధ్యక్షులు బొంతల రాజేష్, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలతో ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బొంతల రాజేష్, గట్ల రమేష్ మాట్లాడుతూ.."అందెశ్రీ తెలంగాణ గీతంతో ప్రజల్లో ఆత్మగౌరవ జ్యోతిని వెలిగించారు. ఆ గొంతు తెలంగాణ ఆవిర్భావానికి ప్రాణం పోసింది. కాంగ్రెస్ పార్టీ మాత్రం ఎల్లప్పుడూ కళాకారులను, ప్రజల భావజాలాన్ని కాపాడుతుంది",వారు లేని లోటు తెలంగాణ సమాజంలోనే కాదు, యావత్



సాహిత్య లోకానికి తీరని లోటని,వారు ఏ లోకంలో ఉన్నా, వారి పవిత్రమైన ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు రామగుండం మున్సిపల్ కార్పోరేషన్ కాంగ్రెస్ పార్టీ పక్షాన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మేయర్ బంగి అనిల్ కుమార్, సీనియర్ నాయకులు కాల్వ లింగస్వామి, పాతపెల్లి ఎల్లయ్య, దీటి బాలరాజు, నాయకులు ఎండీ. ముస్తఫా, తిప్పారపు శ్రీనివాస్, ఈదునూరి హరిప్రసాద్, బొమ్మక రాజేష్, ధూళికట్ట సతీష్, కౌటం సతీష్, దాసరి సాంబమూర్తి, కొప్పుల శంకర్, బాలరాజ్ కుమార్, దొంత శ్రీనివాస్, పంజా శ్రీనివాస్, జెట్టి రమేష్, చెరుకు బుచ్చిరెడ్డి,ఇండ్ల ఓదెలు, కళ్యాణి సింహాచలం, కుంట సది, చొప్పరి శ్రీనివాస్, బూర్ల శ్రీనివాస్, మాలెం మధు, సమ్మెట స్వప్న, దొంతుల కిరణ్, ఆడెపు దశరథం, నాగభూషణం, గుండేటి శంకర్, సన్నీ భాయ్,కెంగర్ల కుమార్, ఫజల్ బేగ్, సిరాజ్, కనుకుంట్ల అశోక్,ఆడెపు రవి, పాతపెల్లి మల్లయ్య, అడప కృష్ణ, పులి రమేష్, సొల్లు రామస్వామి, మరియు యువకులు, బీసీ విభాగం కార్యకర్తలు పాల్గొని, అందెశ్రీ గారి స్ఫూర్తిని కొనసాగించాలనే ప్రతిజ్ఞ చేశారు.

# దక్షిణ యాత్రలకు ఖని ఆర్టీసి బస్సులు





**అక్షరవేదం/గోదావరిఖని: నవంబర్11**
గోదావరిఖని ఆర్టీసీ బస్టాండ్ నుండి విహారయాత్రలలో భాగంగా మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు దక్షణ బారత దేశ యాత్రలకు బయలుదేరింది. యాత్రలో భాగంగా కాణిపాకం, అరుణాచలం, శ్రీరంగం, పలని, కరుంగలిమాల, మధురై, రామేశ్వరం, కంచి, జోగులంబ శక్తిపీఠం యాత్రలకు స్పెషల్ లగ్జరీ బస్సు బయలుదేరిందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. యాత్ర బస్ ను అసిస్టెంట్ మేనేజర్ గిరినాటి.గీతాకృష్ణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎఏంఎఫ్ సంధ్యారాణి, లింగయ్య , హెడ్ గార్డ్ వలి మహమ్మద్ కో ఆర్డినేటర్ కె ఆర్ రెడ్డి, అమృత పాల్గొన్నారు. యాత్రికుల సౌకర్యార్థం ప్రత్యేక రౌండ్ ట్రిప్ యాత్ర ప్యాకేజీ లు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఇక ముందు కూడా మురుడేశ్వర్, గోకర్ణ, గోవా, కుక్కి సుబ్రహ్మణ్యస్వామి, ఉడిపి, ధర్మశాల, షిరిడీ, ప్రయాగ, కాశి, అయోధ్య, శ్రీశైలం, తిరుపతి, లాంటి సుదూర ప్రాంతాలకు యాత్ర ప్యాకేజీ లు ఏర్పాట్లు చేస్తున్నామని, 30మంది బృందంగా ఏర్పడి కోరుకున్న ప్రదేశాలకు బస్సు లను మీ ఇంటి దగ్గర నుండి ఇస్తామని, యాత్ర ప్యాకేజీ పూర్తి వివరాలు గురించి 7013504982, 7382847596 నెంబర్లను సంప్రదించవచ్చని అసిస్టెంట్ మేనేజర్ గీత కృష్ణ తెలిపారు.

# జర్నలిస్టుల రైల్వే పాసులు పునరుద్ధరించాలి

**- ఎంపీ ని కోరిన టీయూడబ్ల్యూజే నాయకులు.**

**అక్షర వేదం/జగిత్యాల నవంబర్ 11:**
జర్నలిస్టుల రైల్వే పాసులను పు నరుద్ధరించాలని కోరుతూ టియు డబ్ల్యూజే (ఐజేయు) జిల్లా శాఖ ఆ ధ్వర్యంలో ఎంపీ ధర్మపురి అరవిం ద్ కు వినతి పత్రం అంద చేశారు. మంగళవారం జగిత్యాల కలెక్టరేట్లో నిర్వహించిన దిశ సమావేశం లో పాల్గొనేందుకు వచ్చిన ఎంపీ ని క లిసిన తెలంగాణ వర్కింగ్ జర్నలి స్టు యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్ర ధాన కార్యదర్శులు చీటి శ్రీనివాస రావు, బెజ్జంకి సంపూర్ణ చారి లు ఈ మేరకు వినతి పత్రం అందజేశా రు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ ప్రభుత్వానికి ప్రజలకు మ ధ్య అనుసంధానంగా ఉంటూ ప్రజా సమస్యల



పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం పనిచేస్తున్న జర్నలిస్టు లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొ న్ని సౌకర్యాలు కల్పించాయన్నా రు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభు త్వం ఆర్టీసీలో రాయితీతో కూడిన ప్రయాణానికి జర్నలిస్టులకు బస్సు పాసులు అందజేస్తుందన్నారు. గ తంలో కేంద్ర ప్రభుత్వం కూడా జర్న లిస్టులకు రాయితీతో కూడిన రైల్వే పాసులను అందజేసేదని వాటిని గ త 3 సంవత్సరాల క్రితం రద్దు చేశా రన్నారు. వివిధ కారణాలతో రద్దు చేసిన జర్నలిస్టు రైల్వే పాసులను పునరుద్ధరించేందుకు కృషి చేయా లని ఎంపీ ని కోరారు. సానుకూలం గా స్పందించిన ఎంపీ అరవింద్ రై ల్వే పాసుల పునరుద్ధరణవిషయం రైల్వే మంత్రి, రైల్వే అధికారుల దృ ష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిం చేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఎంపీ ని కలిసిన వారిలో జర్నలిస్టు యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు గడ్డల హరికృష్ణ, హైదర్ అలీ, కోశా ధికారి సిరిసిల్ల వేణుగోపాల్, సీని యర్ జర్నలిస్టులు రాజేందర్ రెడ్డి, ఆనంద్, వంశీకృష్ణ, చింత లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

# అందెశ్రీ అంతిమ యాత్రలో పాల్గొన్న ముఖ్యమంత్రి

**-పాడే మోసి కుటుంబ సభ్యులను ఓదార్చిన సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, నవంబర్ 11 (అక్షర వేదం) :**
ప్రముఖ కవి, రచయిత, ఉద్యమ గొంతుక, తెలంగాణ రాష్ట్ర గీత రచయిత అందెశ్రీ పార్థివ దేహాన్ని సందర్శించి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వారికి నివాళులర్పించారు. ఎంతోకాలంగా అత్యంత సన్నిహితంగా మెలిగిన అందెశ్రీ ఆకస్మిక మరణంతో భారమైన హృదయంతో ముఖ్యమంత్రి వారి అంతిమయాత్రలో పాల్గొని అశ్రునివాళి అర్పించారు. అంతిమ యాత్రలో పాల్గొన్న ముఖ్యమంత్రి అందెశ్రీ పాడె మోశారు. వేలాదిగా తరలివచ్చిన అభిమానులు, సాహితీప్రియులు అక్షరయోధుడికి కడసారి వీడ్కోలు పలికారు. మొదట లాలాపేట్ జయశంకర్ స్టేడియం నుంచి తార్నాక, ఉప్పల్ మీదుగా ఘట్‌కేసర్ ఎన్ఎఫ్‌సీ నగర్ వరకు అంతిమ యాత్ర సాగింది. అందెశ్రీ సతీమణి మల్లుబాయి, కుమార్తెలు వాక్కులమ్మ,



వెన్నెల, వేకువ, కుమారుడు దత్తు సంప్రదాయం పద్ధతిలో కర్మకాండలను నిర్వహించగా, అధికారిక లాంఛనాలతో అందెశ్రీ అంత్యక్రియలు పూర్తయ్యాయి. ముఖ్యమంత్రి అందెశ్రీ కుటుంబ సభ్యులను ఓదార్చారు. అంతిమయాత్ర కార్యక్రమాన్ని దగ్గరుండి పరిశీలించారు. సాహిత్య సమరయోధుడి అంతిమయాత్రలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి



కృష్ణారావు, ధనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, కేశవరావు, పీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ప్రజాప్రతినిధులు, ఇతర ప్రముఖులు, అధికారులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిస్ (షుగర్) పరీక్ష శిబిరం

**ప్రజల్లో డయాబెటిస్ పై అవగాహన పెంచడమే మా లక్ష్యం -క్లబ్ డైరెక్టర్ గంట వెంకటరమణారెడ్డి**





**అక్షర వేదం,సెప్టెంబర్ 11 రామగిరి**
సెంటినరీ కాలనీలోని తెలంగాణ చౌరస్తా వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీ కాలనీ ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిస్ (షుగర్) పరీక్ష శిబిరం నిర్వహించబడింది. ఈ శిబిరంలో సుమారు 80 మంది ప్రజలు పాల్గొని తమ షుగర్ స్థాయిలను ఉచితంగా పరీక్షించుకున్నారు. ఈ సందర్భంగా క్లబ్ డైరెక్టర్ గంట వెంకటరమణ రెడ్డి మాట్లాడుతూ ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడానికి లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ ముందుంటుంది. డయాబెటిస్ వంటి జీవన శైలీ వ్యాధులపై అవగాహన కల్పించడం సమాజానికి ఎంతో అవసరం అని పేర్కొన్నారు.కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు మేకల మారుతి యాదవ్, డైరెక్టర్ టీవీ సురేష్ బాబు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# నేడు గోదావరి మహా హారతి

**- నదీమ తల్లికి హారతులు...**
**- సకల ఐశ్వర్యాలకు దిక్సూచి: క్యాతం వెంకటరమణ**



**అక్షరవేదం /గోదావరిఖని: నవంబర్11**
గోదావరి నది తీరాన సమ్మక్క సారలమ్మ ఘాట్ గోదావరి ఖనిలో బుధవారం నిర్వహించనున్న మహా హారతి కార్యక్రమం దృష్ట్యా హారతి వేదిక ఏర్పాట్లను బుధవారం హారతి ఉత్సవ సమితి రాష్ట్ర కార్యదర్శి క్యాతం వెంకటరమణ ఆధ్వర్యంలో ప్రతినిధులు పరిశీలించారు. క్యాతం వెంకటరమణ మాట్లాడుతూ.. గోదావరి తీరాన14 సంవత్సరాలుగా మహా హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని లోక కళ్యాణార్థం నిర్వహించే ఈ మహా హారతి కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. గోదావరి తీరాన రెండు వేదికలు వేయనున్నట్టు సభా వేదికతో పాటు హారతి వేదిక కూడా ఉంటుందని గోదావరి నదీమాతల్లికి వేద పండితులచే నక్షత్ర హారతి కుంభ హారతి, కర్పూర హారతి, ధూపహారతి, ఇవ్వనున్నామని తెలియజేశారు. ప్రముఖ నాట్యాచారిని, నృత్య ఖని నిర్వాహకురాలు గుమ్మడి ఉజ్వల కళాబృందం భరతనాట్యం నృత్య ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. మహా హారతి కార్యక్రమంలో భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని గోదావరి మాత ఆశీస్సులు పొందగలరని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాటిపల్లి వెంకన్న, గుండా మంజుల, అంశాల వీరేశం, గుండా రమేష్, శ్రావణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గనవేని మల్లేష్ యాదవ్ ను సన్మా నించిన మల్లన్న పేట గ్రా మ యా దవ సంఘ సభ్యులు



**అక్షర వేదం/కోరుట్ల నవంబర్ 11:**
యాదవ సంఘం జగిత్యాల జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు గనవేని మల్లేష్ యాదవ్, జిల్లా కార్యవర్గ స భ్యులను శాలువాతో ఘనంగా స న్మానించి అభినందనలు తెలిపిన మల్లన్న పేట గ్రామ యాదవ సంఘ పెద్ద మనుషులు సంఘ సభ్యులు ఈ సందర్భంగా సంఘ సభ్యులు మాట్లాడుతూ జగిత్యాల జిల్లా యాదవుల హక్కుల సాధన కోసం జిల్లాలోని అన్ని గ్రామాలు పర్యటి స్తూ గ్రామాల్లో యాదవ సంఘ స మావేశాలు నిర్వహిస్తూ యాదవు ల ఐక్యత కోసం నిరంతరం కృషి చేస్తూ చనిపోయినా నిరుపేద యా దవ కటుంబాలకు, ఆపదలో ఉన్న నిరుపేద యాదవులకు ఆర్థిక సహా యం అందించి అండగా నిలుస్తూ ముందుకు సాగుతున్న తీరు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వ్యవస్థ పక అధ్యక్షులు మల్లేష్ యాదవ్ మాట్లాడుతూ యాదవులందరిని ఏకం చేసి యాదవులకు న్యాయం గా దక్కాల్సిన హక్కులు సాధించే వరకు పోరాటం కొనసాగిస్తానని అన్నారు.తనని సన్మానించి ఆశీ స్సులు అందించిన మల్లన్న పేట గ్రామ యాదవ సోదరా సోదరిను లందరికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలోయాదవ సంఘం జగి త్యాల జిల్లా ముఖ్య కార్యవర్గ స భ్యులు మోతుకు మహేష్ యాదవ్ జంగా జలందర్ యాదవ్, ఆధారవే ణి మల్లయ్య, మొతుకు మల్లయ్య మానుక కొమురెల్లి, మొతుకు రమే ష్, లంబ లస్మయ్య, గంగారాం, సం ఘ సభ్యులు పాల్గొన్నారు.

# హక్కులు సాధించుకుని యాదవుల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టుకుంటాం

**- యాదవ సంఘం జగిత్యాల జిల్లా వ్యవస్థాపక అధ్యక్షుడు గనవేని మల్లేష్ యాదవ్**



**అక్షర వేదం/కోరుట్ల నవంబర్ 11:** యాదవులకు న్యాయంగా దక్కా ల్సిన హక్కులు సాధించుకుని యా దవుల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టు కుందామని యాదవ సంఘం జగి త్యాల జిల్లా వ్యవస్థాపక అధ్యక్షు డుగనవేని మల్లేష్ యాదవ్ అన్నా రు.కోరుట్ల మండలం సర్పరాజ్ ప ల్లి గ్రామ యాదవ సంఘ సభ్యుల సమావేశాన్ని యాదవ సంఘ భవ నలో నిర్వహించారు.ఈ సమావే శంలో జిల్లా ముఖ్య కార్యవర్గ స భ్యులు, అరికంటి సాగర్ యాద వ్ , కల్లూరి దేవయ్య యాదవ్ , అ లిశెట్టి భుచ్చి రాములు యాదవ్ , భూపతి గంగాధర్ యాదవ్, పోడే ళ్ల రాజ మల్లయ్య యాదవ్ లతో కలిసి ముఖ్య అతిధిగా పాల్గొని స భ్యత్వ నమోదుతో సంఘ బలోపే తం, సమస్యల పరిష్కారం, న్యా యంగా యాదవులకు దక్కాల్సిన హక్కుల సాధన తదితర విషయా లు చర్చించారు అనంతరం సర్పరా జ్ పల్లె గ్రామ యాదవ సంఘ స భ్యులు మొత్తం 36 మంది సభ్య త్వం తీసుకోగ వారికి జిల్లా ఇంచా ర్జిలతో కలిసి సభ్యత్వ రసీదులం దించి,జిల్లా కార్యవర్గ సభ్యుడిగా బీనవేణి మల్లేష్ యాదవ్ ని ని యమించిన జిల్లా అధ్యక్షుడు గన వేని మల్లేష్ యాదవ్.ఈ కార్యక్ర మంలోసర్పరాజ్ పల్లె గ్రామ యాద వ సంఘ పెద్ద మనుషులు బైరి రా జు, జీల కనకయ్య, నక్క రమేష్, సంఘ రవి, తాలూక రాజేశం నక్క శ్రీను, సంఘ గంగ మల్లయ్య, బైరి వెంకటి, రాజన్న, మహేష్ సంఘ సభ్యులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గు ఉత్పత్తి పై కార్మికులు దృష్టి సారించాలి..

**-మెడికల్ అటెండెన్స్ నిబంధనలు సరళతరం చేస్తాం.**
**-సకాలంలో పదోన్నతులకు చర్యలు తీసుకుంటాం.**
**-త్వరలో 10 బొగ్గు బ్లాకుల సాధనకు ప్రయత్నాలు.**
**-సింగరేణిని 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి కి పెంచుదాం.**
**-అధికారైన, కార్మికుడైన 8 గంటలు కచ్చితంగా పనిచేయాలి.**
**-ప్రమాద రహిత సింగరేణి ధ్యేయంగా పనిచేయాలి సీఎండీ ఎన్.బలరామ్.**






**అక్షరవేదం/గోదావరిఖని: నవంబర్11** గతానికి భిన్నంగా ఈసారి గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక, అధికార సంఘాలతో జరిగిన నిర్మాణాత్మక సమావేశాలు ప్రశాంతంగా , నిర్మాణాత్మక సూచనలతో, సలహాలతో హుందాగా జరిగాయని, కార్మిక సంఘాలు సూచించిన అన్ని సమస్యల పై కూలంకషంగా చర్చించి సానుకూలంగా నిర్ణయాలు తీసుకుంటామని సీఎండీ ఎన్ బలరామ్ పేర్కొన్నారు.హైదరాబాద్ సింగరేణి భవన్ లో మంగళవారం గుర్తింపు, ప్రాతినిధ్య కార్మిక సంఘాలు, అధికారుల సంఘం ప్రతినిధులతో 38వ సంయుక్త సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఆయన ప్రసంగించారు. కార్మిక సంఘాలు సూచించిన విధంగా మెడికల్ అటెండెన్స్ నిబంధనలను సరళతరం చేస్తామని, కార్మికులకు, అధికారులకు రావాల్సిన పదోన్నతుల్లో ఎటువంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఒకవేళ ఉద్యోగులకు, అధికారులకు ఛార్జ్‌షీట్లు జారీ అయిన పక్షంలో నిర్ణీత వ్యవధిలో వాటిపై విచారణను పూర్తి చేసేలా చూస్తామన్నారు.ఈ సమావేశంలో పాల్గొన్న గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రెటరీ రాజ్ కుమార్, ప్రాతినిధ్య కార్మిక సంఘం ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి ఛైర్మన్ జనక్ ప్రసాద్, అధికారుల సంఘం అధ్యక్షులు లక్ష్మీపతి గౌడ్ లు సూచించిన అనేక సమస్యలపై, సూచనలపై సీఎండీ ఎన్.బలరామ్ సానుకూలంగా స్పందించారు. సంస్థ ప్రగతి పైన భవిష్యత్తు ప్రణాళికలను ఎంతో ఉద్వేగంగా వివరించారు. గతంలో బొగ్గు బ్లాకుల వేలం పాటలో పాల్గొనకపోవడం వల్ల కొత్త బ్లాకులను చేపట్టలేకపోయామని, త్వరలో జరగనున్న సుమారు 100కు పైగా బొగ్గు బ్లాకుల వేలం పాటలో పాల్గొని లాభసాటిగా ఉండే కనీసం 10 బొగ్గు బ్లాకులను కచ్చితంగా సాధిస్తామన్న నమ్మకం ఉందన్నారు. ఈ విధంగా సింగరేణి సంస్థను 100 మిలియన్ టన్నుల ఉత్పత్తి సంస్థగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని, ఇందుకు కార్మిక సంఘాలు పూర్తి సహకారం అందించాలన్నారు. ముఖ్యంగా పని సంస్కృతి మెరుగుపడాలని పునరుద్ఘాటించారు. అధికారులు గానీ కార్మికులు గానీ షిఫ్ట్ లోని ఎనిమిది గంటల సమయాన్ని పూర్తిగా సద్వినియోగం చేస్తేనే సంస్థకు మనుగడ ఉంటుందని స్పష్టం చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడే రక్షణపై చర్చించడం కాదు.. నిరంతర రక్షణ నియమాలు పాటిస్తూ పనిచేయాలన్నారు. గత ఏడాది కాలంగా రక్షణ పెంపుదలకు తీసుకున్న చర్యలు మంచి ఫలితాలు ఇచ్చాయన్నారు. సింగరేణిని శూన్య ప్రమాద కంపెనీగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు.బొగ్గు మార్కెట్లో నిలబడటానికి, వినియోగదారులను మనతో ఉంచుకోవడానికి ఇటీవలనే బొగ్గు ధరను దాదాపు వెయ్యి రూపాయల వరకు తగ్గించడం జరిగిందని, నాణ్యత పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. కార్మిక సంఘాలు ఈ అంశాలపై కూడా దృష్టి సారించి తమ వంతుగా సహకరించాలని, కార్మికుల్ని చైతన్య పరచాలని ఆయన పిలుపునిచ్చారు. కేవలం బొగ్గు ఆధారిత కంపెనీగా మాత్రమే కాకుండా బహుళ వ్యాపార విస్తరణ చర్యలను సింగరేణి చేపడుతుందని ఆయన వివరించారు. ముఖ్యంగా కీలక ఖనిజాలకు రానున్న కాలంలో మంచి డిమాండ్ ఉండబోతుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని కీలక ఖనిజ అన్వేషణ, ఉత్పత్తి కోసం ప్రముఖ జాతీయస్థాయి పరిశోధన సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నట్లు వివరించారు. అంతర్జాతీయంగా ఐదు దేశాలకు సింగరేణి...దేశంలోని 10 రాష్ట్రాల్లో సింగరేణి కార్యకలాపాలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు సీఎండీ వివరించారు. అలాగే చిలీ, బ్రెజిల్, అర్జెంటీనా, ఆస్ట్రేలియా వంటి ఐదు దేశాల్లో కీలక ఖనిజ రంగంలో పనిచేయడానికి ప్రణాళికలు రూపొందించినట్లు వెల్లడించారు. సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఇప్పటికే కార్బన్ డయాక్సైడ్ నుండి మిథనాల్ తయారీ విజయవంతమైందని తెలిపారు. అలాగే గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి రంగాల్లో కూడా అడుగుపెట్టనున్నామని , 500 మెగావాట్ల పంప్డ స్టోరేజ్ ప్లాంటు కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఒడిశాలో 2400 మెగావాట్ల థర్మల్ ప్లాంట్ ఏర్పాటుతో థర్మల్ విద్యుత్ ద్వారా ఏటా గణనీయమైన లాభాలు వచ్చే అవకాశం ఉందని వివరించారు. సింగరేణి సంస్థ అమలు జరిపిన రూ.1.25 కోట్ల ప్రమాద బీమా పథకం నేడు దేశానికి ఆదర్శంగా నిలవడమే కాకుండా అన్ని సంస్థల్లోనూ అమలు జరపాలని ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయని వెల్లడించారు. అధికారులకు సంబంధించిన పీఆర్పీ విషయంలోనూ త్వరలో సానుకూల నిర్ణయం రానుందని తెలిపారు. ముందుగా డైరెక్టర్(పర్సనల్) గౌతమ్ పొట్రు స్వాగతోపన్యాసం చేయగా.. డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, ఎం.తిరుమలరావులు వివిధ అంశాలపై మాట్లాడారు. జీఎం(కో ఆర్డినేషన్) టి.శ్రీనివాస్, జీఎం(పర్సనల్) ఐఆర్ పీఎం కవితా నాయుడు, కార్పోరేట్ జీఎం తదితరులు పాల్గొన్నారు.

# మంథని మున్సిపాలిటీ యవ్వారం పేరు గొప్ప పనులు దిబ్బ అనే చందాన తయారయింది



**అక్షర వేదం/మంథని,నవంబర్11:** మంథని మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డు గంగాపురి, కూచిరాజుపల్లి,శ్రీరామ్ నగర్,శ్రీపాద కాలనీ గ్రామ ప్రజలు మున్సిపాలిటీ పన్నుల భారంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మాజీ వార్డు సభ్యులు గడిపల్లి అజయ్ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు.వ్యవసాయం చిన్న చితక కూలీ పనులు చేసుకుని పొట్ట పోసుకుంటూ జీవనం కొనసాగించే ఇక్కడి ప్రజలకు మంథని మున్సిపాలిటీ పన్నుల భారం విపరీతంగా పెరిగిందని అన్నారు. మంథని మున్సిపాలిటీ సిబ్బంది మంథని చుట్టుపక్కల మున్సిపాలిటీ పరిధిలో గల వార్డుల్లోకి పోయి రోడ్లు, డ్రైనేజీలు శుభ్రం చేసిన దాఖలు అయితే లేవు.మున్సిపాలిటీ యంత్రాంగం నిర్వహణ వార్డు సందర్శనలు లేక రోడ్ల వెంబడి చెత్త, చెదారంతో విపరీతమైన దోమలు డ్రైనేజీల్లో పూడికలు తీయక డ్రైనేజీల నుండి దుర్గంధన వస్తు ప్రజలు విష జ్వరాన బారిన పడుతున్నారు.అసలు ఈ మున్సిపాలిటీ యంత్రాంగం ఎక్కడ ఒక మంథని పట్టణంలో నిర్వహణ చూసుకుంటే సరిపోతుందా అని మంథని మున్సిపాలిటీ యంత్రాంగాన్ని ఆయా వార్డు ప్రజలు ప్రశ్నిస్తున్నారు.మేజర్ గ్రామపంచాయతీ గా ఉన్న మంథని పట్టణాన్ని మున్సిపాలిటీగా మార్చిన తర్వాత సామాన్య ప్రజలు పన్నులు కట్టలేని దుర్భర పరిస్థితి ఉందన్నారు.మున్సిపాలిటీ చేసినప్పటి నుండి ఉపాధి పోయింది.అన్ని రకాల మున్సిపాలిటీ పన్నులు పెరిగాయి.మున్సిపాలిటీ అభివృద్ధి మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని మంథని మున్సిపాలిటీ యంత్రాంగం పైన తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.గత ప్రభుత్వ రాజకీయ నాయకులు తమ రాజకీయ స్వార్ధానికి మునిసిపాలిటీగా మార్చి సామాన్య ప్రజలకు తీరని అన్యాయం చేశారని అన్నారు.మంథనిని మున్సిపాలిటీగా మార్చే క్రమంలో గంగాపురి, కూచిరాజుపల్లి,శ్రీరామ్ నగర్ ను ప్రత్యేకగ్రామపంచాయతీగా ఏర్పాటు చేస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు.ఈ వార్డుల ప్రజల ఆర్థిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకొని రూ.100 ఉన్న నీటి పన్నును 50 రూపాయలు చేయాలని కోరారు.4వ వార్డు గంగాపురిలో సీసీ రోడ్లు నిర్మించి డ్రైనేజీలు నిర్మించకపోవడంతో మురుగునీరు జనావాసాల్లోకి చేరుతుందని సీసీ రోడ్లకు ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించాలని వారు అన్నారు..

# అందేశ్రీ మరణం తీరని లోటు



**అక్షర వేదం/కోరుట్ల నవంబర్ 11:** సహజ కవి అందె శ్రీ మరణం తెలం గాణ సమాజానికి తీరని లోటు అ ని బార్ అసోసియేషన్ అధ్యక్షులు కంతి మోహన్ రెడ్డి అన్నారు. మం గళవారం మెట్ పల్లి బార్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చే సిన నివాళి కార్యక్రమం లో ఆయ న మాట్లాడుతూ, తెలంగాణ ఉద్య మ సమయంలో ఆయన చేసిన సాహితి చైతన్యం వెలకట్టలేనిదని అన్నారు. తెలంగాణ ప్రభుత్వ గీతా రచయిత అయిన అందేశ్రీ రచన లు,కవిత్వం ప్రజల గుండెల్లో చిర స్థాయిలో నిలిచిపోతాయని అన్నా రు. ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శనీయం అన్నారు.ఈ కార్యక్ర మం లో బార్ అసోసియేషన్ ప్రధా న కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు తోగిటి రాజశేఖర్, ట్రెజరర్ పడిగేలా శ్రీనివాస్, సంయు క్త కార్యదర్శి గజేల్లి రాందాస్ మరి యు బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# భూమి ఆక్రమణ చేసిన వ్యక్తిపై తహసిల్దార్ కు ఫిర్యాదు



**అక్షర వేదం మంథని, నవంబర్11:** మంథని మున్సిపాలిటీ పరిధిలోని శ్రీపాద కాలనీ ఒకటో వార్డులో ఎండి.మజీద్ అక్రమంగా భూమి కబ్జా చేసి నిర్మాణం చేపట్టడం జరిగింది.ఇందిరమ్మ పట్టా కు121 గజాలు మాత్రమే ఇచ్చారు.కానీ మజీద్ అనే వ్యక్తి 363 గజాలు కబ్జా చేసి కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపట్టాడు.కావున కబ్జా చేసిన విలువైన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని ఆక్రమణ చేసిన వ్యక్తిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని బోయిన్ పేట్ నివాసి నాయిని సంతోష్ మంథని తహసిల్దార్ కు ఫిర్యాదు చేశారు..

# ఇంటింటికి క్షయ వ్యాధి పరీక్షలు

**– బోడుప్పల్ కమిషనర్ శైలజ**



**అక్షర వేదం/మేడ్చల్ మల్కాజ్గిరి/మేడిపల్లి:** బోడుప్పల్,నవంబర్ 11, నగరపాలక సంస్థలను క్షయ వ్యాధి రహితంగా మార్చుడానికి చేపట్టిన “స్వాస్థ్య నగరం” కార్యక్రమంలో భాగంగా మంగళవారం నాడు బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ లో కమిషనర్ శైలజ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బోడుప్పల్ నగరపాలక సంస్థలో బుధవారం నుండి 14వ వార్డులో క్షయ వ్యాధి పరీక్షలు ఇంటింటికి తిరిగి నిర్వహించడం జరుగుతుందని, క్షయ వ్యాధి పరీక్షలు నిర్వహించే సిబ్బందికి పట్టణ ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ శ్యాం సుందర్ రావు, డిస్టిక్ అండ్ లెప్రసీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీదేవి, యు.పి.హెచ్.సి బోడుప్పల్ డాక్టర్.నరేష్, ప్రాజెక్టు సీనియర్ మేనేజర్ శశికాంత్ నాయక్, ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# యూనియన్ బ్యాంక్ 107వ ఫౌండేషన్ డే వేడుకలు..



**అక్షర వేదం,హైదరాబాద్:** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 107వ ఫౌండేషన్ వేడుకలు రాంనగర్ లోని యూనియన్ బ్యాంక్ లో ఘనంగా జరిగాయి. మంగళవారం బ్యాంకులో మేనేజర్ మినాతి బోయ్, బ్యాంకు ఉద్యోగులు సిబ్బంది సమక్షంలో కస్టమర్ల తో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మినాతి బోయ్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంకు కస్టమర్లకు మరింత మెరుగైన సేవలందించేందుకు ముందుంటామని తెలిపారు. రానున్న రోజుల్లో వినియోగదారులకు సులభతరంగా బ్యాంకు సేవలు అందుతాయని చెప్పారు. పెరుగుతున్న టెక్నాలజీకి తగ్గట్టుగా బ్యాంకు లావాదేవీల్లో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉంటూ వృద్ధులు మహిళలు ఎటువంటి ఓటీపీలకు స్పందించద్దని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు కోటేశ్వరరావు, గురు శంకర్, గంగారత్నం, సిబ్బంది లింగమ్మ, ఇంతియాజ్ తో పాటు కస్టమర్లు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లాలో పోలీసుల విస్తృత తనిఖీలు.

**- ఢిల్లీ బాంబు పేలుళ్ల నేపథ్యంలో గోదావరిఖని 1 టౌన్, పారిశ్రామిక ప్రాంతంలో పోలీసులు అలర్ట్ అయ్యారు.**





**అక్షరవేదం గోదావరిఖని: నవంబర్11**
పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణ పోలీసుల నేతృత్వంలో నగరంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. పారిశ్రామిక నగరంలో రద్దీగా ఉండే ప్రాంతాలలో మంగళవారం పోలీసులు బాంబు స్క్వాడ్, జాగిలాలతో తనిఖీలు చేపట్టారు. జనసంచారం ఎక్కువగా ఉండే ఏరియాలలో పోలీసులు అడుగడుగునా సోదాలు జరిపారు. రామగుండం రైల్వే స్టేషన్, గోదావరిఖని బస్టాండ్, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, అదేవిధంగా ప్రధాన చౌరస్తా, లక్ష్మీ నగర్ బజార్, ఓల్డ్ అశోక్ థియేటర్ ఏరియా తోపాటు నగరంలోని వివిధ ప్రాంతాలలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. ప్రతి ప్రాంతాన్ని క్షుణ్ణంగా సోదా చేశారు. అదేవిధంగా నిత్యం రద్దీగా ఉండే దుకాణ సముదాయాల ప్రాంతాల్లో నిలిచి ఉన్న వాహనాలను బాంబు స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. అనుమానం వచ్చిన వస్తువులను బ్యాగ్ లను జాగిలాలతో సోదాలు చేశారు. ఈ తనిఖీలలో ఎస్ఐ లు రమేష్, భూమేష్, అనూష తో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది, బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రైనీ కలెక్టర్ల సమావేశంలో నాబార్డ్ షార్ప్ ఎఫ్ పి ఓ అధికారులు



**అక్షర వేదం/మహాముత్తారం, నవంబర్ 11:**
మహా ముత్తారం మండలంలోని ములుగు పెల్లి గ్రామంలో నాబార్డ్ షార్ప్ ఎఫ్ పి ఓ అధికారులు, ఏవో గడ్డం అనూష ఆధ్వర్యంలో ట్రైనీ కలెక్టర్లతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఇందులో ట్రై ని కలెక్టర్లు ఎఫ్ పి ఓ మేడారం గిరిజన ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ వారిని రైతులకు ఎలాంటి ఉపాధి డెవలప్మెంట్ కల్పిస్తున్నారని అడగడం జరిగింది. అందుకు ఎఫ్.పి.ఓ అధికారులు నాబార్డ్ నుండి సార్పు సంస్థ వారి ఆధ్వర్యంలో ఎఫ్ఇఓ సాంక్షన్ గురించి రిజిస్ట్రేషన్ గురించి షేర్ క్యాపిటల్ రైతు వాటాధనం గురించి తెలియజేయడం జరిగింది. అలాగే ప్రస్తుతం మందుల పిచికారి కి డ్రోన్ సాంక్షన్ అయిందని అలాగే ఎఫ్ పి ఓ వల్ల రైతులకు కలిగే లాభాల గురించి తెలియజేయడం జరిగింది. రైతుల కోసం మార్కెటింగ్ అందుబాటులో ఉండాలని చేపల పెంపకం గురించి రైతులు వ్యవసాయం అనేది మార్కెటింగ్ సులభతరంగా చేసుకునే వీధి విధానాలు గురించి తెలియజేయడం జరిగింది. ఈ సమావేశంలో సార్ ప్రోగ్రాం మేనేజర్ సారీ అలాగే డి టి ఎఫ్ ప్రోగ్రాం మేనేజర్ వీరన్న షార్ప్ సిబ్బంది, ఎఫ్ పీ ఓ, సీఈఓ పోడం దామోదర్ పాల్గొన్నారు.

## ప్రజాశక్తి రిపోర్టర్ చింత వెంకన్న ను పరామర్శించిన


**మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు.**



**అక్షర వేదం/మహబూబాబాద్ జిల్లా, మరిపెడ మండలం:-నవంబర్ 11.**
మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ప్రజాశక్తి రిపోర్టర్ చింత వెంకన్న,కు గాల్ బ్లాడర్ స్టోన్స్ సర్జరీ చికిత్స జరిగింది .అని తెలుసుకొని అనంతరం ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్న మరిపెడ మండల ప్రజాశక్తి రిపోర్టర్ చింత వెంకన్న ను పరామర్శించిన మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు , ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకుని ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని,వైద్యుల సూచనల ప్రకారం సమయానుసారం మందులు వాడుతూ విశ్రాంతి తీసుకోవాలని తగు సూచనలు తెలిపారు, వారి వెంట మరిపెడ మున్సిపల్ మూడో వార్డు మాజీ కౌన్సిలర్ రేఖ లలిత వెంకటేశ్వర్లు, వీరబోయిన మురళి, కొక్కు సునీల్, చింత వెంకన్న కుటుంబ సభ్యులు తదితరులున్నారు.

# ఆర్టిఐ సమాచారాన్ని కోరిన మల్లారం యువకుడు కాసిపేట శ్రీకాంత్

**అక్షర వేదం/మంథని,నవంబర్11:**
పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని మల్లారం గ్రామపంచాయతీ నిర్వాహనలో అవకతవకలు జరిగాయని మల్లారం యువకుడు కాసిపేట శ్రీకాంత్ సమాచార హక్కు చట్టం 2005 ద్వారా 2013 నుండి 2025 అక్టోబర్ వరకు పలు అంశాలపై సమాచారాన్ని కోరడం జరిగింది.
2025 ఆగస్టులో సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారాన్ని తీసుకున్న సమయంలో అసంతృప్తి సమాచారాన్ని పొందడం జరిగిందని ఆ సమాచారం లో భాగంగా గ్రామ పంచాయతీకి సంబంధించిన కొన్ని రికార్డులను పరిశీలించినప్పుడు పనులకు సంబంధించిన పూర్తి వివరాలు రికార్డులో నమోదు చేయలేదు. అంతేకాకుండా గ్రామ పంచాయతీకి వచ్చిన నిధులను తెలుగు అక్షరాలలో స్పష్టంగా రాస్తూ




పెట్టిన ఖర్చులను మాత్రం ఆంగ్ల భాషలో చిన్న చిన్న అక్షరాలలో ఇతరులకు అర్థం కాని విధంగా వ్రాశారు.గతంలో చేపట్టిన నిర్మాణాలను సైతం ప్రస్తుతం చేపట్టిన నిర్మాణాలుగా రికార్డులో రాయడం జరిగింది. గ్రామపంచాయతీ ట్రాక్టర్ ఉపయోగించింది తక్కువే కానీ ట్రాక్టర్ మెయింటెనెన్స్ కోసం అధిక డబ్బులు వెచ్చించినట్లు రికార్డుల్లో రాశారు.గ్రామ పంచాయతీ సిబ్బంది తీసుకున్న జీతాలకు సంబంధించిన వివరాలు సైతం స్పష్టంగా రాయలేదు.గతంలో వేసిన సిసి రోడ్లు,బోర్ లు వాటికి అయిన ఖర్చులు వ్రాశారు.కానీ వాటిని ఎక్కడ వేశారో వివరాలు సరిగ్గా రాయలేదు.ఇలా అన్ని అంశాలకు సంబంధించి స్పష్టంగా లేకున్నప్పటికీ వారికి అనుకూలంగా ఆడిటింగ్ చేయించుకోవడం విడ్డూరంగా ఉంది.ఈసారి కోరిన అన్ని అంశాలపై స్పష్టమైన సమాచారాన్ని ఇవ్వాలని సమాచార హక్కు చట్టం ద్వారా శ్రీకాంత్ స్పష్టమైన సమాచారం ఇవ్వాలని ఒక ప్రకటనలో తెలిపారు..

# నిరవధిక నిరాహారదీక్ష భగ్నం

**-శ్రీకాంత్ అక్రమ అరెస్టును ఖండిస్తున్నాం**
**-తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్**
**-కాటారం సబ్ డివిజన్ కి 500 కోట్లు తీసుకొచ్చి అభివృద్ధి చేయకపోతే మంత్రిగారి ఇంటి ముట్టడి చేస్తాం**
**-వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా సహాయ కార్యదర్శి ఆత్కూరి శ్రీకాంత్**

**అక్షర వేదం, కాటారం నవంబర్ 11**
కాటారం సబ్ డివిజన్లోని ఐదు మండలాల పరిస్థితి అంతంతమాత్రంగానే ఉన్నదని రోజు రోజుకి అభివృద్ధి వెనక పోతుంది తప్పితే పురోగమించడం లేదు అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శ్రీకాంత్ అన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాటారం సబ్ డివిజన్ కి 500 కోట్లు కేటాయించాలి వంద పడకల ఆసుపత్రి పరిశ్రమలు అంబేద్కర్ విజ్ఞాన కేంద్రం మినీ స్టేడియం డిజిటల్ లైబ్రరీ రోడ్ల పునరుద్ధరణ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన



వారిపైన చర్యలు తీసుకోవాలని టోల్గేట్ యాజమాన్యం పైన చర్యలు తీసుకోవాలని కాటారంలో ఎడ్యుకేషనల్ హబ్ ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లతో ఈరోజు నిరవధిక నిరాహార దీక్ష కి కూర్చోవడం జరిగింది. దీనికి తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం డివైఎఫ్ఐ కెవిపిఎస్ బి.ఎస్.పి బీసీ ఎస్టీ టిడిపి డి.ఎస్.పి టిఆర్ఎస్ లో మద్దతునిచ్చాయి దీక్షలో కూర్చున్న మూడు గంటల్లోనే పోలీసులు దీక్ష భగ్నం చేసి అక్రమంగా అరెస్టు చేయడాన్ని ప్రజాసంఘాలు ప్రతిపక్ష పార్టీలు ఖండించాలని ప్రజాస్వామ్య దేశంలో ప్రజాస్వామ్య బద్ధంగా శాంతియుతంగా న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వానికి తెలియపరిచే ప్రక్రియ చేయొద్దు అన్న విధంగా ఈ ప్రభుత్వ పాలకులు వ్యవహరిస్తున్నారని ఇది వ్యక్తిగతంగా మంత్రి గారిని విమర్శించడానికి వారిని దూషించడానికో కాదని 60 ఏళ్లుగా కాటారం సబ్ డివిజన్ అభివృద్ధి పాలకుల కొట్రలకు బలైపోయి వెనుకబడుతానని గురవుతుందని అభివృద్ధి చేయకుండా అభివృద్ధి చేయమని అడిగితే అక్రమనసులు చేయడం ప్రభుత్వ పాలకుల పతనానికి బీజం వేసినట్లేనని ఈ కార్యక్రమాన్ని ఇంతటితో ఆపేది లేదని మంత్రిగారు గనక అన్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోతే త్వరలోనే మంత్రి గారి ఇల్లు ముట్టడికి సిద్ధమవుతామని భవిష్యత్ కార్యక్రమం రూపొందించి ప్రజలను వేగం చేస్తూ ఉద్యమాలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు వంగాల లక్ష్మి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి భూక్య నవీన్, యంగ్ ఉమెన్స్ జిల్లా కన్వీనర్ బందు సుజాత, కో కన్వీనర్ బుర్ర స్వాతి ,కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆత్కూరి శ్రీధర్, డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యురాలు బుర్ర శృతిలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణ క్లాత్ స్టోర్ వంగవీటి రామకృష్ణ ను ను పరామర్శించిన

**మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి**



**అక్షర వేదం/మరిపెడ మండల కేంద్రము:-నవంబర్ 11.**
మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో కృష్ణ క్లాత్ స్టోర్ వంగవీటి రామకృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ లో చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న కృష్ణ క్లాత్ స్టోర్ వంగవీటి రామకృష్ణను మహబూబాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు పరామర్శించి , ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకుని ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని,వైద్యుల సూచనల ప్రకారం సమయానుసారం మందులు వాడుతూ విశ్రాంతి తీసుకోవాలని తగు సూచనలు చేశారు, వారి వెంట మరిపెడ మున్సిపల్ మూడో వార్డు మాజీ కౌన్సిలర్ రేఖ లలిత వెంకటేశ్వర్లు, ఏడవ వార్డ్ కౌన్సిలర్ ఊరుగొండ శ్రీనివాస్,బిఆరెస్ నాయకులు వీరబోయిన మురళి,కొక్కు సునీల్,గుండగాని స్టాలిన్, రామకృష్ణ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలు



**అక్షర వేదం /మహబూబాబాద్ జిల్లా , కలెక్టరేట్:- నవంబర్ 11.**
భారతరత్న మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలను అధికారికంగా జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించిన "జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, (రెవెన్యూ) కె.అనిల్ కుమార్,ఈ కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, జడ్పీ సీఈఓ పురుషోత్తం, జిల్లా విద్యాశాఖ అధికారి దక్షిణామూర్తి, డిడి గ్రౌండ్ వాటర్ సురేష్, వడ్డెబోయిన శ్రీనివాస్, ఏడి మురళి, మందుల శ్రీరాములు, మైనారిటీ శాఖ నజీర్ హైమద్ ఖాన్, రంజిత్, గోపి, కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఓటరులో దాగున్న
## ఓ..నిశ్శబ్దం! ఓ..స్తబ్ధత!!ఓ..నిర్లిప్తత!!!

ప్రజాస్వామ్యంలో ఓటు ఓ.. వజ్రాయుధం!
పాలకుల నడ్డీని విరిచే ఓ.. శాసన దండం!
పాలకులు ఈ ఆయుధాన్ని చూసే కదా!
జడివానను తలపించే హామీల వర్షాన్ని కురిపించేది!
కొంగొత్త ఆశలతో ఊరించి
ఊహల పల్లకిలో ఊరేగించేది!
కొండంత అండగా నిలుస్తామనీ,
బల్ల గుద్ది మరీ భరోసా ఇస్తూనే,
రేయనకా! పగలనకా!
కాలుకు బలపం కట్టుకొని తిరిగేది!
మరి సర్వశక్తులూ ఒడ్డి గల్లీ గల్లీ తిరిగినా?
గడప గడపకూ కాళ్ళభేరానికి కొచ్చినా!
నేడు జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ?
ఎందుకో? కారణమేమిటో మరి??
అంతు పట్టని ఓ..అగాధంలా
ఓటరు నాడి భళే విచిత్రమైంది!
బహు స్వేచ్ఛ వాతావరణంలో
గెలుపు ఓటముల నిర్ణయించే కోణంలో
సర్వాధికారాలున్న ఓటరులో
చైతన్యమున్న ఈ మహా నగరంలో?
ఈ నిశ్శబ్దానికి ఈ స్తబ్దతకు కారణాలేమిటో?
ఓట్లశాతం తగ్గిన ఈ బలహీనతలో గల
లోగుట్టేమిటి?లోపమెక్కడుంది??
ప్రజాస్వామ్యానికిది తీరని ముప్పు కాదా?
ప్రజాస్వామ్యవాదులారా?
బహు మేధావుల్లారా??
కారణాలేమిటో?దుర్భిణితో విశ్లేషించండి!
సమస్య సాధనా కోణాన్ని
ఆవిష్కరించండి!!
(తేది:11.11.2025 రోజున జూబ్లీహిల్స్
ఉపఎన్నికల్లో తగ్గిన ఓట్లశాతంపై
(48.24%)
స్పందిస్తూ రాసిన కవిత)



పరాంకుశం రఘు నారాయణ
గ్రామం:తొర్రూరు
మహబూబాబాద్ జిల్లా
చరవాణి:9949749987